# మంత్రద్వయ మహాత్మ్యము

(నారాయణ, ద్వయ మంత్రార్థము)



శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ



రచయిత్రి శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ

పతిదేవులు (పరమపదవాసులు) శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట రాఘవాచార్యులు అయ్యవార్లతో

అంతర్జాల మాధ్యమం

**www.pravachanam.com**

# మంత్రద్వయ మహాత్మ్యము

(నారాయణ, ద్వయ మంత్రార్థము)

పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీరంగ రామానుజ జీయర్ స్వామి వారి

మంగళాశాసనములతో




పరిష్కర్త

శ్రీ మొలుగు రంగాచార్యులుగారు



భాగవత కైంకర్యం

శ్రీ ఎస్.టి.పి. శ్రీవేంకటేశ్వర్లుగారు, హైదరాబాద్

# మంత్రద్వయ మహాత్మ్యము

శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ

© రచయిత్రి

ప్రథమ ముద్రణ, డిజిటల్ వెర్షన్

**జూలై, 2021**

**శ్రీ ఎస్.టి.పి. శ్రీవేంకటేశ్వర్లుగారు, హైదరాబాద్**

**(రచయిత్రి ద్వితీయ పుత్రుడు)**

**9848276694**

వెల

**అమూల్యం**

సంప్రదించుటకు

**శ్రీ ఎస్.టి.పి.ఎస్.వి. రాఘవాచార్యులు**

9490942884

ప్రింటర్

**ముద్రిక ప్రింటర్స్, విజయవాడ**

# ప్రార్థనము

**స**ర్వేశ్వరా! నీవు చేతనులకు సర్వవిధముల బంధువువు, ఆధారమైనవాడవు, సాధనమైనవాడవు, ప్రాపకమైనవాడవు, ప్రాప్యమైనవాడవు, సర్వదా రక్షించు వాడవు. దేవాధిదేవా! సర్వమునకు తల్లివి తండ్రివి నీవే. పూజ్యతముడగు గురువువు, కారుణ్యాదులచే సర్వాధికుడవు. నీకు సాష్టాంగ నమస్కారము. నా సర్వాపరాధముల క్షమించదగుదువు.

ఈ నారాయణ మంత్రము ప్రతిపాదించు సర్వబంధువులగు మునులు ముముక్షువులు భక్తులు భాగవతులు ఆళ్వారులు సూరిసమూహము కలసి – సేవింపను తపింపను జపింపను తగినవాడవు నీవేయని తలచి, నిన్నే సేవించి తరించిరి. సర్వచేతనులకు నట్టి భాగ్యము లభించును గాక!

శ్రీయఃపతీ! నీవు సర్వ దివ్యదేశములలో నిలచియుండి బద్ధాత్మల నుద్ధరించు చుంటివి. అయినను నీ గురించిన వైలక్షిణ్య జ్ఞానము పొందజాలనైతిని. నన్ను కరుణించి ఎల్లవేళల నిన్ను మరువలేని ఆర్తిని ప్రసాదించుము. నారాయణ మంత్రము ననుగ్రహించినవాడవు, మంత్రముచే ప్రతిపాదించబడినవాడవు. నీకు సర్వవిధ కైంకర్యముల జేయు భాగ్యము ప్రసాదింపుము.

ఈ మంత్రార్థ వైభవమును చేతనులు సర్వకాలములందు అనుభవించి తరింతురుగాక! పాండిత్య హీనతచేత, గురుశుశ్రూషా రాహిత్యముచేత, విషయము గహనమైనందున అవగాహనా లోపముచేత, యీ సంకలనమందు దొరలిన దోషముల మన్నింతువుగాక!

**భాగవతపదదాసి**

**శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ**



# నారాయణ మంత్రార్థ వైభవము

అది విష్ణులోకము, పరంధామము, వైకుంఠము. పరంధాముడైన నారాయణుడు కొలువైయుండుచోటు. నిత్యసూరులు ముక్తపురుషులు అంజలి ఘటించి, పరంధాముని చూచుచుండుచోటు. స్వామిని స్తుతించుచుండు తావు. స్వామి ముఖవికాసము వీక్షింపదలచుచుండు ప్రదేశము. కాని ఆనాడు వారికి స్వామి ముఖవికాస దర్శన భాగ్యము కలుగదాయెను. దేవతాశ్రేష్ఠులను సృజించి ఒక్కొక్కరి కొక్కొక్క జగద్రక్షణ భారము నప్పగించిన సర్వేశ్వరుడు నిశ్చింతుడై యుండవలెను గదా? భూరమాదేవేరు లిద్దరు జగత్స్థితి భారము వహించి యుండగా భగవంతునికి చింత యెందుకు? ఇంట బయట స్వామి సంకల్ప మాత్రముచేతనే సర్వకార్యములు నెరవేర్చుటకు చేతులు కట్టుకొని పరివారము నిలచియుండగా స్వామికి పరధ్యాన మెందుకు?



ప్రకృతికి వశమై కరణ కళేబరములులేక, మూలప్రకృతియందు ఆత్మలు ఎన్నో పడియున్నవి. వారు తనను చేరుకొని సేవాభాగ్యమును పొందుటకు సాధనములగు శరీరములు వారికి కావలెను. ప్రకృతియందు మునిగి యుండిన జీవులు తమ దోషముల ఫలముగా పుట్టుచు చచ్చుచు దుఃఖపరంపరలలో మునిగి యున్నారు. ఇన్నిటిని పరికించుచు నుండిన నారాయణుడు ఎట్లు నిశ్చింతుడుగా నుండగలడు? వారు తనయందు శేషి శేష భావము వదలినవారు, భ్రష్టులై యున్నవారు. వారిని స్వామి యెట్లు ఉపేక్షించి యుండగలుగును? అట్టివారు తనను చేరుకొనుట కొరక ఆశ్రయణము కావలెను. దాని ద్వారా వారు తనను ఆశ్రయించి ఆనందించగలరు.

ఆ ఆశ్రయణము ఎట్టిదై యుండవలెను? తనంత తానే ప్రమాణమైనది కావలెను. ఒక దానిని మరొకటిగా భ్రమించుటకు అవకాశమీయనిదిగా నుండవలెను. జీవులను మభ్యపరచునది కారాదు. తెలుసుకొనగోరు జిజ్ఞాసువులకు ఆయా అర్థములను ప్రసాదించునదిగా నుండవలెను. భగవద్దత్తమైనది కావలెను. భగవత్ప్రోక్తమై యుండవలెను. అట్టిది వేదము. దానిని శ్రీమన్నారాయణుడు చేతనులకు ప్రసాదించెను.

కాని వారు అల్పబుద్ధులు. అట్టి జీవులు వేదసారమును గ్రహింతురో? లేరో? కనుక సర్వేశ్వరుడు వేదసార విపులీకరణ చేయు రామాయణమును వాల్మీకి మహర్షిచే వ్రాయించెను. బాదరాయణమునిచే సాత్త్విక పురాణములను మహాభారతమును చెప్పించెను. మనువు పరాశరుడు వంటి వారిచే స్మృతులను చెప్పించెను. పాంచరాత్రము వంటి ఆగమముల నిచ్చెను. నిరుక్తాది శాస్త్రములను తగినవారిచే వ్రాయించెను. శాస్త్రాభ్యాసము చేతనులకు పరమాత్మ స్వరూపము తెలుపును. వారి యభీష్టములను మరొక జన్మయందైన నెరవేరజేయును. అందువలన వారు భగవద్దత్తమగు ఆనందఫలము పొందగలరు.

జీవులీ క్లేశములను భరించగలరా? భరించి వేదార్థసార లాభము పొంద గలరా? దుర్లభముగా తోచుటలేదా? వారి గతి యింతేనా? వారికి తరుణోపాయము లేదా? ఉపాయమేమి? వారు తమ యొక్క, పరమాత్మ యొక్క స్వరూపము ఎరుగవలెను. తమ మనోభీష్ట మీ జన్మయందు కాకపోయినను మరొక జన్మయందైన పొందుటకు సాధనమైన ఉపాయ మెరుగవలెను. సర్వేశ్వరునిచే తమకు అనుగ్రహింపబడు ఫలము – ఆనందమను యెరుక కలిగియుండవలెను. ఈ సమస్యలన్నిటి పరిష్కారములు సులభముగ పొందుటకు – సర్వ వేద వేదాంత శాస్త్ర పురాణ ఆగమ సారమైన – నారాయణ మంత్రమును ప్రసాదించెను. ఇది నారాయణ మంత్రావతరణము.

* * *

మంత్రము ఋషిప్రోక్తము కావలెనందురు. ఋషులెవరు? పరమాత్మ సృష్టిలోని చేతనులే కదా! వారు చెప్పు మంత్రాధిష్టాత, ఫలప్రదాతయు నెవరు? భగవంతుడే కదా! ఈ మంత్ర మా పరమాత్మ ప్రోక్తమైనందున సర్వశ్రేష్ఠమైనది. మంత్రోపదేష్టయైన ఆచార్య డొకరుండవలెను కదా! ఈ మంత్రమును పరమాత్మ తానే ఆచార్యుడై బయలుపరచెను. గురువుగా తాను నారాయణ ఋషియై బయలుపరచెను. అంతేకాదు దానిని తానే శిష్యుడై పరిగ్రహించెను. ఆ శిష్యుడెవరు? అతడును ఋషియే. అతడు నరఋషి. ఉపదేశస్థానమో? జ్ఞాన క్షేత్రముల నెల్ల తలమానికమగు బదరికావనము.

మంత్రము అల్పాక్షరములు కలదైనచో నిచ్చుటకును గ్రహించుటకును సౌలభ్యముగా నుండును. ధారణకును సులవుగా నుండును. ఈ మంత్రమీ సౌలభ్యములన్నియు కలిగియున్నది. మంత్రాక్షరముల సంఖ్య అల్పమే అయినను, దీని అర్థము శాస్త్రబుద్ధి బలములచే తెలుసుకొనదగియున్నది. పరమ గురువుల ఉపదేశ మూలమున గ్రహింపదగి యున్నది. దీనిని సదాచార్యుని శుశ్రూష

చేసి పరిపూర్ణముగ తెలుసుకొనవలెను, తరించవలెను. అన్యథా మార్గము లేదు. అదియే మోక్షమార్గము. ఇక మంత్ర గౌరవమును గూర్చి విపుల విచారమొనర్ప వలసి యున్నది.

మోక్ష శబ్దపు మూలధాతువు 'విడచుట' యను అర్థము నిచ్చుచున్నది. విడచుట వలన కలుగు ఫలము మహదానందము. ఆనంద మనగానేమి? భగవదనుభవమే ఆనందము. దీనియందు ఇచ్ఛ కలవాడు విడువదగినది – సంసారము. అనగా భగవదనుభవానందము పొందుటకు సంసారము విడువదగి యున్నది. సంసారము నుండి విడుదల కోరువాడు ముముక్షువు – అనబడుచున్నాడు. ముముక్షువునకు ముప్విధములైన జ్ఞానములు అవసరమై యున్నవి. అందు మొదటిది తనను గురించిన స్వజ్ఞానము. రెండవది ఉపాయమును గురించిన జ్ఞానము. దీనిని ప్రాపక జ్ఞానము అందురు. మూడవది పురుషార్థమును గురించిన ప్రాప్యజ్ఞానము. వీనిని గూర్చి ముముక్షువు తెలుసుకొనవలెను.

అన్ని వేద వేదాంతముల శాస్త్రముల పురాణముల ఆగమముల సారమంతయు అల్పాక్షరములయందు యిముడ్చబడిన దైనందున ఈ మంత్రార్థము పరమ గుహ్యమై యున్నది. తనను మననము చింతనము చేయు వానిని రక్షించునదే కదా మంత్రము! శ్రీ నారాయణ మంత్రము జీవుల స్వరూపములకు తగినవాని యొక్క, విడువదగినవాని యొక్క, పొందదగినవాని యొక్క పూర్ణజ్ఞానము కలిగించి రక్షించును. చేతనుడు భగవంతునికి వాని యిష్ట ప్రకారము వినియోగించుకొనుటకు తగియుండవలెను. అనగా జీవునికి స్వార్థమైన వ్యాపారమేదియు నుండరాదు. అట్టి వానిని అకించనుడనియు, శేషమనియు నందురు. వాడు భగవంతునికి కాక యితరులకు దాసుడై యుండుటకు యోగ్యతలులేక యుండవలెను. దీనిని అనన్యార్హ శేషత్వమందురు.

జీవుడు అట్టివాని అభీష్టసిద్ధికి భగవంతుడు కాక స్వప్రయత్నముచే సంపాదించు యితర ఉపాయములులేక యుండవలెను. వానికి నారాయణుడే దిక్కు అను నమ్మిక యుండవలెను. వేరుగా నేదిక్కును లేనివానిని అగతికుడని యందురు కదా! ఇట్లు నారాయణుడుకాక వేరు దిక్కులేక యుండుటను అనన్య శరణత్వము అందురు.

అనన్యార్హ శేషత్వము అనన్య శరణత్వము అనన్యభోగత్వము అను మూడును అ అను అక్షరముతోనే ఆరంభమగుచున్నవి. కనుకనే విశిష్టాద్వైతము యీ మూడిటిని కలిపి ఒకే సమాసములో అకారత్రయము అని పేర్కొనుచున్నది. ఈ త్రయమును నారాయణ మంత్రము ప్రతిపాదించుచున్నది. మంత్రము అను మాటకు రక్షించునది యను అర్థమున్నది కదా! ఈ మంత్రము చేతనుల నెట్లు రక్షించును? అను సందేహము కలుగవచ్చును. మంత్రమునకు రెండు విధముల శక్తులున్నవి.

మంత్రమును అక్షరలక్షగా జపించవలెను. అందు పదియవ వంతు ఆవుపాలతో తర్పణ చేయవలెను. మరియొక పదవ వంతు హోమము చేయవలెను. ఇంకొక దశమ భాగముతో పుష్పాంజలులు సమర్పింపవలెను. ఈ విధముగా శబ్దశక్తి కలుగును. దాని వలన బ్రహ్మతేజము ప్రభవించును. అది అజ్ఞానమను చీకటిని పటాపంచలు చేయును. ఆ జ్ఞానజ్యోతీ ప్రభావము ఈశ్వర సాక్షాత్కారము కలిగించును. ఈ క్రియ కార్యసిద్ధికారక మగును. క్రియ యనగానే దానికెన్నియో నియమములు నిష్ఠలు పాటించవలసి యుండును. బహుప్రయాసతో కూడియుండును. దీనిని సాధించిన వానిని మంత్రశక్తి రక్షించును.

ఇక రెండవది మంత్రమందలి అర్థశక్తి. ముముక్షుత్వము వలన మంత్రాధికారులైన వారు – జ్ఞానులు, అనుష్ఠానపరులునైన సద్గురువుల వలన సరియగు పద్ధతిలో మంత్రార్థమెరిగినచో, వారిని అర్థశక్తి రక్షించును.

మంత్రార్థమును గ్రహించుట వలన కలుగు యితర ఫలితములును కలవు.

దేహము ఆత్మ వేరనియు, దేహముకంటె ఆత్మ విలక్షణమైనదనియు తెలియును.

ఆత్మకు స్వతంత్రత లేదనియు, అది పరమాత్మకు పరతంత్రమైనదను ఎఱుక కలుగును.

చేతనుడు వేరెవరికిని కాక, సర్వేశ్వరునికే శేషభూతుడని తెలియును.

అతడు తనను తాను రక్షించుకొన జాలని వాడనియు, ఈశ్వరునిచే రక్షింపబడు వాడనియు తెలియును.

దేహబంధువులు బంధువులు కారనియు, నారాయణుడే తనకు నిరుపాధిక బంధువనియు గ్రహించును.

ఇది మంత్ర గౌరవము.

* * *

ఇంతటి శక్తివంతమగు యీ మంత్రమును మంత్రగౌరవమునకు తగినంత ఆర్ద్ర హృదయముతో ముముక్షువులు కానివారి – అనగా మంత్రాధికారము లేనివారి – చెవిని పడకుండ జపించవలెను. వాగ్రూపమున నున్న వేదములు వేదశిరస్సులనబడు ఉపనిషత్తులు శాస్త్రములు స్మృతులు నీ మంత్రమున నణగి యున్నవి. విష్వక్సేన సంహిత దీనిని మంత్రములలో పరమ మంత్రమని చెప్పుచున్నది. రహస్యములో నుత్తమ రహస్యమనుచున్నది. ఇది పవిత్రమైన వానిని కూడ పవిత్రము చేయునది. సనాతనమైనది యగుటచే, మిగిలిన మంత్రములకు మూలమై 'మూలమంత్రము' అనబడుచున్నది.

ధీమంతుడైన శిష్యుడు గురువైభవమును అధికము చేయవలెను. దీక్షతో మంత్రమును రక్షించవలెను. ఈ రెండు ప్రయోజనములను సాధించని శిష్యునికి ఆయుఃక్షీణమగునని శాస్త్రములు తెలుపుచున్నవి. మంత్రమందు – మంత్రమందు

ప్రతిపాదింపబడిన అచ్యుతునియందు – ఏ ప్రతిఫలమును ఆశింపక ఉపదేశించిన గురువునందు, ప్రేమ యున్నచో – మంత్రము కార్యసాఫల్యమును మోక్షమును ఇచ్చును.

విశ్వమంతయు దైవాధీనమై యుండగా, నా దైవము మంత్రాధీనుడై యున్నాడు. ఆ మంత్రము మాత్రము సదాచార సంపన్నత బ్రహ్మజ్ఞానమును కల బ్రాహ్మణాధీనమై యున్నది. అట్టి మంత్రమును తాను జపించుచు, ముముక్షువులైన వారికి అర్థసహితముగ నుపదేశించు సద్విజుడు దైవస్వరూపునిగ పరిగణింపబడుచున్నాడు.

అజ్ఞానాంధకారమును దూరము చేయువాడు 'గురువు' అనబడును. అతడు ముముక్షువులకు మంత్రోపదేశము చేయుచున్నను తాను గురువునని తలచక – తన గురువు తనలో నుండి ఉపదేశించుచున్నట్లు తలచవలెను. తనవలె శిష్యుడును – తన ఆచార్యునికే శిష్యుడని తలచవలెను. ప్రతిఫలము నాశించక భగవంతునకు మంగళాశాసనము చేయు మరియొక వ్యక్తి లభించుచున్నాడని – ఆనందించవలెను. ఇవి సద్గురు లక్షణములై యున్నవి.

* * *

సంసారులు సాత్విక రాజస తామసములను త్రిగుణములకు లోనగుచున్నారు. అనాది ప్రకృతి సంబంధముచేత అవిద్య కర్మవాసన రుచులకు వశులగుచున్నారు. తత్ఫలముగా అవస్థల పాలగుచున్నారు. అవస్థలనగా నేవి? గర్భ బాల్య యౌవన వార్థక్య జర మరణములను ఆరును అవస్థలు. నిజమునకు జీవులు భగవంతునికి దాసభూతులు. వారు ప్రకృతియందు కాని, పరమపద మందు కాని ఎచటనున్నను భగవంతునికి దాసభూతులే, కాని వారీ సంబంధమును మరచియున్నారు.

విష్ణుతత్త్వ మనుగ్రంథము ననుసరించి పరమాత్మయే ప్రపంచమంతటికి,

ఆత్మలన్నిటికి పతి, ఆత్మ లాతని సొత్తు, అతడు వానికి స్వామి, ఇది వారి మధ్య గల ఘనిష్ఠమైన సంబంధము. ఈ సంబంధమును కూడ జీవులు మరచి యున్నారు. అంతేకాదు, తాము తమ స్వామికి చేయవలసియున్న సేవ లేక కైంకర్యమును మరచి సంసార సాగరమున పడి మునుగుచు తేలుచు కళవళ పడుచున్నారు. జల సముద్రమున దాటుట కంటె సంసార సాగరము నుత్తరించుట కష్టము.

ఈ సముద్రమందు మూడు రకముల కెరటములు ఉవ్వెత్తుగ నెగసిపడు చుండును. నీరు నిప్పు గాలి భూమి ఆకాశము అను పంచభూతములచే నిర్మితమైనది శరీరము. దీనికి కలుగు వ్యాధులు – కామము క్రోధము లోభము మోహము భయము మదము మాత్సర్యము ద్వేషము శోకము అసూయ ఈర్ష్య మొదలగు శారీరక మానసిక తాపము లను కెరటములను ఆధ్యాత్మిక తాపము లందురు. పశువులు పక్షులు మానవులు పిశాచములు పాములు రాక్షసులు – వంటి వాని వలన కలుగు బాధలు అధిభౌతికములను కెరటములు. శీతవాతములు విద్యుత్తు వంటి వానిచే శరీరమునకు కలుగు బాధలు అధిదైవిక కెరటములు.

ముప్పిధములైన యీ తాపములచే బాధపడు జీవులు – బద్ధచేతనులు. వీరు పరమాత్మ స్వరూపమును గాని జీవాత్మ స్వరూపమును గాని ఎరుగకున్నారు. స్వరూపమును పురుషార్థ రూపమును విరోధి స్వరూపమును గుర్తింపలేకున్నారు. పంచభూత లక్ష్మణములైన శబ్దము స్పర్శము రసము గంధము రూపములను విషయములకు లోనైయున్నారు. నారాయణుడను నావతప్ప వీరిని యీ సాగరమును దాటించు మరియొక సాధనము లేదు. ఆ సర్వేశ్వరుడు అనంతమైన కళ్యాణ గుణములు కలవాడు. ఆ కళ్యాణ గుణములు ఏవి? లక్ష్మీతంత్రము యిట్లు చెప్పుచున్నది. నారాయణుడు పరుల దుఃఖములను సహించనివాడు.

వారి దుఃఖములకు తాను వ్యధ చెందువాడు. ఈ రెండిటిచే తన హృదయమున దయ కలవాడు. తనకు కలుగు వ్యధకు పరుల దుఃఖములను సహింపలేక పోవుటకంటె వేరు కారణమేమియు లేదు. ఇవియే కళ్యాణ గుణములు – పరులకు శుభము కలిగించునవి.

ఈ గుణముల కారణముగ చేతనునికి కలిగిన శుభమేమి? విష్ణులోకమును వైకుంఠమని, పరమపదమని, త్రిపాదవిభూతియని చెప్పుదురు. ఇది ప్రకృతి వెలుపల గలదు. ఈ మహోన్నత స్థానమునకు జేర్చు నారాయణ మంత్రమును నారాయణ ఋషి రూపమున గురువై యుపదేశించెను. ఇట్లు పరమాత్మ గురురూపధారి యగుటేకాక, తానే నర ఋషి రూపుడై మంత్రమును గ్రహించెను. ఇట్లు గురుశిష్య రూపములు ధరించుట ఎందుకు? లోకములకు ఆచార్య శిష్య ఆదర్శ లక్ష్మణములు తెలుపుటకేయని గ్రహించవలెను. ఆచార్య లక్షణము లేవి?

ఆచార్యుడు మూడు దోషములు లేనివాడుగా నుండవలెను. అతడు ఇతర దేవతలను ఇతర సాధనములను ఇతర మంత్రములను ఆశ్రయించుటయును మూడు దోషములులేక యుండవలెను. పరంపరాగతమైన సత్సంప్రదాయ నిష్ఠుడై యుండవలెను. నిర్దుష్టమైన జ్ఞానము కలవాడై యుండవలెను. ఉపదేశమందు గాని ఫలమునందుగాని భిన్న అభిప్రాయములకు దూరుడు కావలెను. వేద వేదాంత ప్రమాణ బుద్ధి కలిగియుండవలెను. పరమాత్మయందు నిష్ఠ కలవాడు కావలెను. వేదా వేదాంత సార శాస్త్ర జ్ఞానములు కలిగినవాడై యుండవలెను. శుద్ధ సత్త్వప్రకృతిపరుడు కావలెను. ఉన్నదానిని ఉన్నట్లు గ్రహించువాడుగాను, తెలుపువాడుగాను ఉండవలెను. పూర్వులు అనుసరించిన అనుష్టానమునకు అనుగుణమైన ఆహార సహవాస అనువర్తన నియతులు కలిగినవాడు కావలెను. భగవంతునియందు భాగవతులయందు గురువులందు సత్ శిష్యులయందు అసూయాపరుడు కారాదు. శబ్దస్పర్శాదులు పతనమునకు దారితీయునవి.

ఆచార్యుడట్టివానిని జయించినవాడు కావలెను. అతడు శిష్యులకు దీర్ఘ బంధువు. అనగా – శిష్యుడు అతనిని విడచినను – తానతనిని విడువనివాడు కావలెను. పరుల కష్టములను సహించలేని దయాపరుడు కావలెను. చెడుదారి పట్టిన శిష్యుని శిక్షించియైనను ఋజుమార్గమునకు త్రిప్పు సమర్థుడు కావలెను. సత్‌శిష్యుడెట్టి లక్షణములు కలిగి యుండవలెను?

మన పరంపర యిట్లు చెప్పుచున్నది. శిష్యుడు వేద శాస్త్రములందు విశ్వాసము, అవి చెప్పినట్లు ఆచరించుట కలిగి యుండవలెను. సదాచారము సత్ప్రవర్తనలు కలవాడై యుండవలెను. శుచి కావలెను. అహంకారము లేనివాడు, విష్ణుభక్తి నిరతుడునై యుండవలెను. గంభీరుడు నేర్పరియునై ఆచార్యసేవయందు నిష్ట కలిగి యుండవలెను. తన శరీరము, సంపద, జ్ఞానము, గృహము, ప్రాణము, సద్గుణములు – తాను చేయు సత్కర్మలు – తనకు జ్ఞానమును ప్రసాదించిన పరమ గురువునకే శేషమని తలచువాడు కావలెను. దేనిని గ్రహించవలెనో దేనిని త్యజించవలెనో తెలుసుకొని యుండవలెను. జ్ఞానమునకు తగిన అనుష్టానము కలిగి సాత్త్వికుడై యుండవలెను. జీవ ఈశ్వర తత్త్వములు తెలుసుకొను కోరిక కలవాడు. నాది నేను అను భావములు విడచినవాడు. సాష్టాంగ నమస్కారార్పణ శీలుడు, అవకాశము వచ్చువరకు వేచియుండి సందేహములు తీర్చుకొనువాడు కావలెను. ఇంద్రియములను బుద్ధిచే మరల్చువాడు, భగవద్భాగవతాచార్యుల యందు అసూయ లేనివాడువై యుండవలెను. శరణాగతుడై ఆశ్రయించినవాడై యుండవలెను. అట్టివానిని ఆచార్యుడు పరీక్షించి శిక్షించి తత్త్వజ్ఞాన ముపదేశించవలెను.

శిష్యునికి మోక్షాపేక్ష యుండవలెను. గురువునే బ్రహ్మమని గతియని విద్యయని ఆశ్రయమని కోరదగినవాడని ధనమని భావించుట శిష్యలక్షణము. ఆచార్యుని దేహయాత్ర తన యాత్మయాత్ర యని, అతనితో సంబంధము తనకు

తారకమని నమ్మిన శిష్యుడు గురుసేవాప్రవణుడై యుండును. ఇట్టి సచ్ఛిష్య లక్షణములు లోకమున కెఱుకపరచుటకే సర్వేశ్వరుడు తాను నరరూపధారణ చేసి శిష్యుడయ్యెను, ఆచరించి చూపెను. ఇట్లు నారాయణ మంత్ర జపము వలన జ్ఞానమును తద్వారా మోక్షమును పొందవలెనా? అనేక వేద శాస్త్రాభ్యాసము వలన కలిగిన జ్ఞానము వలన మోక్షమందకూడదా?

శాస్త్రము లనేకములు, వాని ద్వారా జ్ఞానార్జన కష్టము. శాస్త్రములు భిన్న భిన్న అర్థముల దెలుపును. దానితో బుద్ధిలో సందేహము లేర్పడును. దానితో జ్ఞానము నిశ్చితముగా నుండదు. ఆచార్యుడైనచో సూక్ష్మమైన మంత్రమును మంత్రార్థమును ఉపదేశించును. అతడు ప్రసాదించు నిశ్చయ నిర్దుష్ట జ్ఞానము వలన పరమాత్మ నెఱిగి, వానినే ఉపాయమని నమ్మి, మోక్షమందుట సులభము. శాస్త్రాభ్యాసము తాను స్వయముగ శ్రమించిన ధనమైయుండగా, ఆచార్యోపదేశ లబ్ధ మంత్రార్థ జ్ఞానము పితృదత్తమైన విత్తము వలె సులభముగా నిర్దుష్టముగా లభించును. కాని మంత్రములు అనేకములు కదా?

మంత్రమనగా భగవన్మంత్రము. భగవంతుని గుణముల వలె మంత్రములును అనేకములు. భగవంతుడు భక్తపరాధీనుడైనందున 'వశీ' యనబడుచున్నాడు. కాని యతడు విశ్వము నంతయు తన వశమందు కలవాడు. తనను తన శరీరమును ఆశ్రితుల కిచ్చు వదాన్యుడు. ఆశ్రితులు తమ అల్పత్వమును, సర్వేశ్వరుని ఆధిక్యమును గమనించి వెనుదీయకుండ, వారితో తనను సమానము చేసుకొను సౌశీల్యము కలవాడు. ఆశ్రితులతో మనో వాక్కాయములను ఏకరూపము చేసుకొనియుండు నిష్కపటి. సంసార పతిత భ్రష్టులను కూడ నిత్యసూరులతో సమానుల జేయగల పావనత్వము కలవాడు. ఆశ్రిత వియోగము సహించలేని మృదుస్వభావము కలవాడు. హృదయమంతట దయను నింపుకొని యున్నవాడు. దయా విహీనుడైనను విడువజాలనంతటి మధురభాషణ కలవాడు. ఆశ్రితుల ప్రాతికూల్యములకు చలించని స్థిరబుద్ధి

కలవాడు. ఆశ్రయించువారి జన్మము వృత్తము వంటివానిచే కలుగు భేదములను ఎంచక సమభావము చూపువాడు. ఆశ్రితుల కర్తవ్యాంశములను తానే అనుష్టించువాడు. పరులు చేసిన అపకారములను గణించక, తనను శరణన్న మాత్రమునకే వారికి కృతజ్ఞుడై యుండువాడు. ఇటువంటి అనంత కళ్యాణ గుణములు కలవాడా జగన్నాథుడు. అతని గుణములు అనంతములైనట్లే, మంత్రములును అనంతములు. మంత్రముల విభజన ఏదియు లేదా?

విశ్వమందంతటి నన్నిటిలో సర్వగుణములతో వ్యాపించియున్నవాడైన భగవంతుని స్వరూపమును ప్రతిపాదించు మంత్రములు వ్యాపక మంత్రములు. సర్వేశ్వరుని అవతారగుణ చేష్టితములయందు ఏవో ఒకటి రెండు గుణాదులను ప్రతిపాదించునవి అవ్యాపక మంత్రములు. వీనియందు భగవద్వ్యాపకత్వము ఏదో ఒక భాగమునకే పరిమితమై యుండును. ఈ రెండు విధములగు మంత్రములలో వ్యాపకమంత్రములు శ్రేష్టములు.

మంత్రమునకు ప్రణవ నమఃపదములు సహజముగ చేరియుండుట ప్రధాన లక్షణము. అట్టివి విష్ణు గాయత్రి యందు యిమిడియున్న నారాయణ వాసుదేవ విష్ణు మంత్రములు.

1. నారాయణాయ విద్మహే – నారాయణుని ఉపాసించుచున్నాము.
   వాసుదేవాయ ధీమహి – వాసుదేవుని ఉద్దేశపూర్వక స్మరణ చేయుచున్నాము
   విష్ణుః ప్రచోదయాత్ – ఆ ధ్యానమును విష్ణువు మాకు ప్రసాదించు గాక!
2. ఓమ్ నమో నారాయణాయ – అనునది ఎనిమిది అక్షరములు కల నారాయణ మహా మంత్రము. ఇది మూలమంత్రము, అష్టాక్షరి అనబడుచున్నది.

3. ఓమ్ నమో భగవతే వాసుదేవాయ – ఇది పంద్రెండక్షరములు కల వాసుదేవ మంత్రము

వీనిలో రెండవదైన నారాయణ మంత్రము ఉత్కృష్టమైనది. ఇందు తెలుసుకొనదగిన అన్ని అర్థములు ప్రతిపాదింపబడి యున్నవి. మిగిలిన వానికంటె నారాయణ మంత్రోత్కృష్టత యేమి?

సర్వదేవుల యందు నారాయణుని కంటె పరుడు లేనట్లే – సర్వ మంత్రము లందు అష్టాక్షరిని మించిన మంత్రము లేదు. వ్యాసమహర్షి శిష్యులకు పుత్రులకు నీ మంత్రము కంటె ఉత్కృష్టమైన మంత్రము లేదని – చేతులెత్తి సత్యప్రమాణము చేసి చెప్పుటయే యిందుకు నిదర్శనము. ఇంతకు ముందు మూడు మంత్రము లను ప్రస్తావించుట జరిగెను కదా. ఈ మంత్రము మిగిలిన రెండిటికంటె శ్రేష్టతమమని చెప్పుట యెట్లు? మిగత వానిలో అశిష్టపరిగ్రహ లోపమున్నది.

1. ఓమ్ నమో విష్ణవే – ఇది షడక్షరీ మంత్రము. విష్ణువు వ్యాపించి యుండవలెను. కాని యిది యేయే పదార్థములందు సర్వేశ్వరుడు వ్యాపించినది తెలుపుట లేదు. అంతర్యామిగ వ్యాపించి యుండుటను, వ్యాపించి యుండుట వలని ఫలమును తెలుపుటలేదు. వ్యాపించువానికి గల పరమాత్మ గుణముల దెలుపుటలేదు. విష్ణు పరమాత్మ ఆయా దేహములందు వ్యాపించుచున్నాడు, జీవాత్మయు నంతే. ఇచట స్వరూప జ్ఞానవ్యాప్తులు కలవు. కాని వ్యాప్తికి హేతుభూతమైన వస్తువు తెలుపబడుట లేదు. ఇది లోపము.

2. ఇక వాసుదేవ మంత్రమును ద్వాదశాక్షరి యందురు. వాసుదేవ శబ్దము సర్వత్ర వ్యాపించుచున్నాడని – వ్యాపించు ప్రకారమును చెప్పుచున్నను – వ్యాపించబడుచున్న పదార్థమునకు వాచక శబ్దము లేదు. అచట నుండునది అను అర్థబలము వలన సర్వశబ్దము అర్థాత్ సిద్ధమైనను – గుణసంబంధము లేని లోపము సరిదిద్దుటకు – భగవత్ శబ్దము తెచ్చిపెట్టవలసి వచ్చినది.

వ్యాపించుట యేయే వస్తువులందు? ఏ విధముగ? దాని వలన ఫలమేమి? అనువానికి వివరణ రానందున – దీనియందు అసంపూర్ణత యున్నది. నారాయణ మంత్రమునకు అటువంటి లోపములు లేవా?

పరిశీలింతము. పరమాత్మ యేయే పదార్థములందు వ్యాపించును? ఉభయ విభూతులయందు అని సమాధానము. కనుక పదార్థ స్వరూపము తెలుపుచున్నది. అంతర్యామిగ వ్యాపించునని క్రమమును తెలుపుచున్నది. అందువలన పరమాత్మకు చేతనులకు కలుగు ఫలము ఉపాయోపేయత్వము అని తెలుపుచున్నది. వ్యాపకుని యొక్క గుణములు జ్ఞానము ఆనందము, అమలత్వాదులు; జ్ఞాన శక్తి బల ఐశ్వర్య వీర్య తేజత్వ వాత్సల్య స్వామిత్వ సౌశీల్య స్వామిత్వాదులైన గుణములు. ఈ విధముగ నారాయణ మంత్రము భగవంతుని దివ్యాత్మ స్వరూపమును, దివ్యమంగళ విగ్రహత్వమును, కళ్యాణ గుణకత్వమును, విభూతులను ప్రతిపాదించుచున్నది. ఈ మంత్రాధిక్యతకు గల కారణములు సంగ్రహముగా నేవి?

ప్రత్యేకముగ నొక ఉపనిషత్ యీ మంత్రవైభవమును తెలుపుట.

ఓమ్ నమః పదములు సహజముగ మంత్రమన జేరియుండుట.

చతుర్విధ పురుషార్థములలో నుత్తమోత్తమమైన మోక్షమునకు కారణమై యుండుట.

మంత్రముచే ప్రతిపాదింపబడు భగవంతుని మించి మంత్ర ప్రభావమే గొప్పది యని తెలుపుచుండుట.

సకల వేదసారమై యుండుట.

శిష్ట పరిగ్రహము, అర్థపూర్ణత కలిగియుండుట.

అల్పాక్షరసమేతమై ఉచ్చారణకు సులభమై అధిక ఫలము నిచ్చుచుండుట.

మంత్రమునకు మంగళసూత్ర సామ్యము నిర్ణయమై యుండుట.

విష్ణు గాయత్రిలో వ్యాపకమంత్ర ప్రతిపాదనమందు నారాయణ శబ్దము ముఖ్యముగా ప్రతిపాదింపబడుట.

అన్ని వేదములు యీ మంత్రాత్మకుడైన పరమాత్మనే ప్రతిపాదించు చుండుట.

నాలుగు వేదములే కాక తైత్తరీయ నారాయణోపనిషత్ కూడ నారాయణ పరతత్త్వమును తెలుపుచున్నది. మహోపనిషత్ సృష్టికి పూర్వము నారాయణు డొక్కడే కలడనుచున్నది. సుబాలోపనిషత్ కారణములేక ఏ వస్తువును ప్రభవింపలే దనియు, దానికి పూర్వము నారాయణు డొక్కడే కలడనియు చెప్పుచున్నది. అంతేకాదు, అతడే యీ ప్రపంచ సృష్టి చేసెననియు, చూచు కన్ను, చూడబడు వస్తువేగాక అన్ని కర్మేంద్రియములు నారాయణాత్మకమే యనుచున్నది. మహాకాలము, భూమ్యాకాశములు, దిక్కులు నారాయణుడే యనియు సర్వకాలము లందుండువాడు నారాయణుడనియు, పరమపదమందు నిత్యసూరు లాతనినే చూచుచుందురని ఇతరోపనిషత్‌లును చెప్పుచున్నవి.

అంతర్యామి బ్రాహ్మణము – జీవాత్మ పృధివి శరీరముగా కలవాడని సర్వభూతాంతరాత్మయైనవాడని అయినను భూతస్పర్శ లేనివాడని – పరమాత్మ యని – అద్వితీయుడని నారాయణుని తెలుపుచున్నది. రామాయణమున యుద్ధకాండయందు బ్రహ్మ, "రామా! నీవు సాక్షాత్నారాయణుడవు. దుష్ట సంహారము చేయువాడవు. అనాదివి, పరబ్రహ్మవు, పరమ ప్రాప్యుడవు, కర్మఫల ప్రదాతవు, ఈశ్వరుల కీశ్వరుడవు, శరణ్యుడవు" అని స్తుతించియున్నాడు.

నారాయణ మంత్రోచ్చారణ దుఃఖములను తొలగించును, కోరికలను తీర్చును, ఇహలోక సౌఖ్యములను మోక్షప్రాప్తిని కలిగించును. దీనిని నారాయణునికి నమస్కరించి నిత్యము జపించవలెను. ఏ అవస్థయందైన యీ మంత్రజపము చేయువాడే బ్రాహ్మణుడు. భుజించు వస్తువులను నారాయణ మంత్రముతో స్పృశించి స్వీకరించవలెను. జన్మరాహిత్యమునకై యీ మంత్రము స్మరించవలెను. మోక్షకాముకుల కిదియే శరణ్యమై యున్నది. నారాయణుడే భగవంతుడు. ఆయనయే పరబ్రహ్మము. ఆయనయే దాత, అతడే త్రాత. అష్టాక్షరీ మంత్ర స్వరూపముతో జీవుల నాలుకలపై నర్తించువాడు. ఈ మంత్రము దైవప్రోక్తము, దైవోపదేశము, దైవగ్రహీతము. ఋషిప్రోక్తముకాదు – ఋషులచే జపింపబడునది. సకల మంత్రములకు మూలమగు మూలమంత్రము. సనందననాది మునులు ఋషులు దీని నాశ్రయించియే పరమపదము నందిరి. పాపపరిహారమునకు ఆత్మశుద్ధికి సన్యాసులు దీనినే స్మరించుచున్నారు. సంధ్యా కాలములందు దీనినే జపించవలెను. మంత్రమా? మంత్రముచే ప్రతిపాద్యుడైన భగవంతుడా? ఎవరు రక్షకమగుదురు?

మంత్రము నాలుకపై తాండవించుచు నుండునది, తక్షణమందు సమీపవర్తియై యుండునది. భగవంతుడో? సర్వలక్షణోపేతుడై దూరమున నుండ, వాక్కుతో పిలువగా వినివచ్చును. ద్రౌపది కురుసభలో ఆర్తిచెంది, తనకు వశిష్ఠ డుపదేశించిన మంత్రము ఉచ్చరించినంతనే రక్షణ లభించినట్లు భారత సభాపర్వము చెప్పుచున్నది. ఆ సమయమున కృష్ణ గోవిందాది నామములు కల నారాయణు డెక్కడనున్నాడు? దూరమున ద్వారకయందు కదా! భగవంతుని శతకోటి నామములలో నొక నామస్మరణమే అంతటి ఫలము నీయగా, మంత్ర ప్రభావము వేరుగా జెప్పవలెనా? ఇది యిహలోక సంబంధులైన వానిని పుత్ర పశ్వాది రూపముల నీయగలదు. స్వర్గాది పరలోక నివాస సౌఖ్యములను

ప్రసాదించగలదు. ఆత్మానుభవ రూపమైన కైవల్యము నీయగలదు. సాలోక్య సారూప్య సామీప్య సాయుజ్యాది ముక్తులను ప్రసాదింపగలదు. అపేక్షించు నధికారులకు జప తప హోమ తర్పణాది కృత్యములచే సాధితమై ఆయా పురుషార్థ ప్రదాత కాగలదు. యోగములు మంత్రములు యాగముల మధ్య గల అనుబంధము నెఱుగదగియున్నది.

యోగములు మూడు – అవి కర్మ జ్ఞాన భక్తి యోగములు. వీనికి విరోధులు పాపములు. నారాయణ మంత్రము పాపములను నివర్తించి అపేక్షిత యోగములను పూర్ణముగ నెఱవేరజేయును. యజ్ఞము దానము తపస్సు ధ్యానము సంధ్యావందనము పంచమహాయజ్ఞములు. హోమము తీర్థయాత్ర చాంద్రాయణము తీర్థస్నానము చాతుర్మాస్యము. ఫలములు దుంపలచే జీవనము శాస్త్రాభ్యాసము సమారాధనము తర్పణము వంటి వానిచే దేహమును ఇంద్రియములను నియంత్రించి పాపనిరోధము చేసుకొనుటయే కర్మయోగము. పాపనివృత్తి జరిగినచో యింద్రియముల ద్వారా జరుపు ధర్మభూతమైన జ్ఞానమునకు శబ్దాదులు విషయములు కాజాలవు.

యోగము ఎనిమిది అంగములు కలది. అందుచే అష్టాంగయోగ మనబడు చున్నది. యమ నియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధి రూపమైనది ఇది. ఇది యోగాభ్యాసమునకు ఆత్మను విషయముగ జేయును. అష్టాంగయోగము వలన కలుగు జ్ఞానమునకు హృదయ కమలము – ఆదిత్య మండలము మొదలగుచోట్ల నివసించి యున్న భగవంతుని విషయముగ జేసి ఆ పరమాత్మ స్వరూపమును, రూపములను అలంకారములతోను లక్ష్మీదేవీ సహితముగ అనుభవించి, యోగాభ్యాస క్రమముచే ఆ అనుభవకాలమును వృద్ధిచేసుకొనుటయను – ఎడతెగని భావనయే జ్ఞానయోగము. దీనికి నారయణ మంత్రమును జతకలిపినచో – జ్ఞాన యోగ ప్రారంభమునకు విఘ్నము కలిగించు

పాపములను నశింపజేయును, జ్ఞానయోగమునకు అతిశయము కలిగించును, తద్వారా జ్ఞానయోగ ఫలమునిప్పించును.

తైలధారకు విరామముండనట్లు భగవంతుని ఎడబాయక అన్ని అవస్థలలోను భగవత్స్మృతి పరంపరా రూపమైన మధురానుభవము కలిగి యుండుటయే భక్తియోగము. ఈ యోగము ననుసరించువారికి ఆరంభ విరోధిపాపము. దానిని నారాయణ మంత్రము నశింపజేసి భగవద్భక్తిని వృద్ధి చేయును, భక్తి యోగ ఫలమును పొందజేయును.

భగవద్గీత 18వ అధ్యాయమందు ప్రతిపాదింపబడిన ప్రపత్తియోగము స్వరూప విరుద్ధమైనది కాదు. కర్మ జ్ఞాన భక్తులనెడి ఉపాయముల వలె దుశ్శక్యమైనదియు కాదు. అందరును అవలంబించుటకు సుకరమైనది, స్వరూపానుగుణమైనది. ప్రపత్తి యనగా శరణాగతి. దీనిని న్యాసము, భరన్యాసము అనియు నందురు. 'నీవుగాక నాకు వేరుగతి లేదు, దయా భావముతో నన్ను రక్షింపుము' అని భగవంతుని ప్రార్థించుట ప్రపత్తి. ఈ మార్గానుయాయులకు నారాయణ మంత్రము 'పారతంత్ర్యమే జీవుని స్వరూప' మను జ్ఞానము కలిగించును. అర్థవిచారము వంటివానిచే సత్కాలక్షేపమునకు తగిన కారణమగును. భగవంతుడే తనకు అన్ని దేశకాల అవస్థలందు – తేనెవలె – పాలవలె – అమృతమువలె భోగ్యమైన వాడను గట్టి భావనను కలిగించును. పరబ్రహ్మ స్వరూపమేమి? పరబ్రహ్మను పొందు జీవాత్మ స్వరూపము ఏది? ఇందుకు తగిన ఉపాయమేమి? అందువలన కలుగు ఫలమేమి? ఈ నాలుగిటికి విరోధి స్వరూపమేది? అనునవి యింకను విచారింప వలసియున్నవి.

సాధారణముగా రెండుగాని, అంతకంటె ఎక్కువగాని అక్షరములు కలిగి, అర్థమునిచ్చు దానిని పదము అందురు. అట్టి మూడు పదములు నారాయణ

మంత్రమున నున్నవి. అవి ఓమ్, నమో (నమః), నారాయణాయ అనునవి. ఇది ఎనిమిది అక్షరములు కలిగి అష్టాక్షరి యనబడుచున్నది. నారాయణుని గురించి విశదీకరించునదిగాను, నారాయణునిచే ననుగ్రహించబడినదిగాను ఉండుటచే నారాయణ మంత్రమైనది. మంత్రములలో అనాదియైనదిగాను, మిగిలిన మంత్రములకు మూలమైనదిగాను ఉండుటచేత మూలమంత్రమైనది. ఓమ్ అని ప్రథమమున, నమో (నమః) అని తరువాత, నారాయణాయ అని ఆ పిమ్మట – ఈ మూడును కలసి మంత్రమైనది. ఓమ్ అనునది ఏకాక్షరము; నమః అనునది రెండక్షరములు; నారాయణాయ – అనునది ఐదక్షరముల పదములు. వీనిలో మొదటి పదము శేషత్వమును, రెండవ పదము పారతంత్ర్యమును, మూడవది సేవ లేక కైంకర్యమును తెలుపుచున్నవి. ముందు శేషత్వమును తెలుపు ఓమ్ గురించి విచారించుదము.

శేషుడనగా – ఆదిశేషుడు లేక అనంతుడు. (అనంతునిపై శయనించుట వంటి సేవలు పొందువాడు అనంతశయనుడనబడుచున్నాడు.) అతడు పరంధామునికి శేషభూతుడై – దాసభూతుడై – సమయానుసారముగ స్వార్థ రహితుడై తనను కైంకర్యమున వినియోగించుకొనుచున్నాడు. అతడు నివాసముగా (ఇల్లుగా), శయ్యగా (పడకగా), ఆసనముగా (సింహాసనముగా), పాదుకగా (పాదరక్షగా), అంశుకముగా (పురుషులు ధరించు ఉత్తరీయముగా), ఉపధానముగా (దిండుగా), వర్షాతపవారణగా (ఎండవానల నివారణకు తగిన గొడుగుగా) స్వామిసేవలందు తనను తాను వినియోగించుకొనుచున్నాడు. ఇట్లు స్వామికి శేషభూతుడై శేషుడనబడుచున్నాడు. అట్లే జీవుడును (జీవాత్మయు) తనను భగవత్ సేవలో అన్వయించుకొనవలసిన భావము శేషత్వమనబడు చున్నది.

ఒదిగి యుండువాడు పరతంత్రుడు. పరుడైన పరమాత్మకు పరతంత్రుడై

యుండువాడు, జీవుడు (జీవాత్మ). అటువంటి పరతంత్ర భావమే పారతంత్ర్యము. ఇక గరుడుని విషయవిమర్శ చేయుదము. అతడు నారాయణుని యెదుట తన గురుత్తుల (రెక్కల) నెత్తిపట్టుకొని – అవధానముతో – స్వామి యెపుడు వచ్చునో? తనకేమి యాజ్ఞాపించునో? యని యెదురు చూచుచు – స్వామి యాజ్ఞాపించు సేవలో నిస్స్వార్థముగ నుపయోగపడుచుండును. దీనినే సేవ లేక కైంకర్యము అందురు. ఇక ప్రణవమనగానేమో విచారించవలెను.

ఓమ్ అనునది ఏకాక్షర పదము కదా! అనగా నొకే అక్షరము ఒక పదమై, ఒక ముఖ్యమైన అర్థమును వ్యక్తము చేయుచున్నది. దీనిని ప్రణవము అందురు. ఇది అఖండ ప్రణవము మాత్రమే (ఏకాక్షర ప్రణవము మాత్రమే) కాదు; సఖండ ప్రణవమునై యున్నది. అనగా అ ఉ మ అను మూడక్షరములు సంధించి – సఖండ ప్రణవమై – ఓమ్ అగుచున్నది. సంధిలేనపుడు విడివిడిగా నుండి పరబ్రహ్మ, చేతనులందు కృప కలవాడు – అను అర్థముల నిచ్చుచున్నది.

వేదములు అనంతములైనను – వానిలో ఋగ్యజుస్సామవేదములు త్రయి అనబడుచు ప్రధానములై యున్నవి. వానిని తగు ఆచార్యుల యొద్ద నేర్చి, వాని యర్థవిచారము చేసి, తద్వారా పరబ్రహ్మము నెఱుగుటకు మానవుని ఆయుఃపరిమాణము చాలదు. పైగా దానికి శాస్త్ర పరిచయమును కావలెను. శాస్త్రములా ఎన్నెన్నో! తెలుసుకొనవలసిన విషయములు అనంతములు. ఆయువో? స్వల్పము. విఘ్నములా? లెక్కించలేనన్ని. కావున సారవంతమైన అల్ప విషయమును మాత్రమే ఉపాసించుట లెస్స కదా!

వేరు వేరు భాండములలో పాలెన్నో కాచి, తోడుపెట్టి, చిలికి తీసిన వెన్న తక్కువగనే ఉండును. దానినొక భాండమందే యుంచి కాచినచో బుద్ధిని వృద్ధిచేయు నెయ్యి తయారగును. ఎన్నో భాండముల నిండ కాచిన పాల సారమంతయు ఒక భాండములోనికే వచ్చినది కదా! ఎన్నో చెరకుగడల

సారమంతయు నల్ప పరిమాణముగ బెల్లమగుచున్నది. వేదముల సారమంతయు వ్యాహృతులయందు సూక్ష్మరూపమున నున్నది. అందు భూః అను వ్యాహృతి ఋగ్వేదములోనిది. భువః యను వ్యాహృతి యజుర్వేదము లోనిది. సువః యను వ్యాహృతి సామవేదములోనిది. బంగారమును పుటమువేసిన దాని వన్నె హెచ్చును. భగవంతుడీ వ్యాహృతులను తపింపజేయగా మేలిమి బంగారము వంటి మూడక్షరములు పుట్టినవి. భూః నుండి అ; భువః నుండి ఉ; సువః నుండి మ అను అక్షరములు వచ్చినవి. వీని నదే క్రమములో కలుపగా ఓమ్ ఏర్పడినది. ఇదియే ప్రణవ మనబడుచున్నది.

భూః అనగా జగత్కారణభూతుడగు పరమాత్మయే కార్యరూపమున పరిణమించెనని యర్థము. భువః అనగా జగత్తునందు గల చేతనులలో (ఆత్మలలో లేక జీవులలో) పరబ్రహ్మను ఆశ్రయించినవారికి (ఆశ్రితులకు) సంసార నివృత్తి చేయువాడని యర్థము. సువః యనగా ఆత్మలన్నిటి యందు ప్రవేశించియుండు సర్వాంతర్యామి యని యర్థము కనుక వేదవ్యాహృతులైన యీ మూడిటినుండి వచ్చిన అ ఉ మ యను అక్షరములు వేదముల సారమై యున్నవి.

అక్షరమనగా నాశనము పొందనిది అని అర్థము. అటువంటి అక్షరములచే నేర్పడిన ఓమ్ కూడ నాశనము లేనిదే యగుచున్నది. ఈ కారణము చేతనే వేదములు, వేదవేద్యుడగు నారాయణుడు, వేదసారమైన ప్రణవములు నాశన రహితములైనవి. అక్షరములలో మొదటిది. 'అ' ఇది స్వతంత్రమైనది. మిగిలిన అక్షరములకు కారణము – ఆధారము – నాశనరహితమునై యున్నది. అ అను ధాతువు రక్షించునది యను అర్థము నిచ్చుచున్నది. అ అను అక్షర విషయ విచారమింకను చేయదగి యున్నది.

పరమాత్మ పురుషులలో ఆద్యుడునైన వానికి అక్షరములలో మొదటిదైన

అ యని నామకరణము చేయబడినది. అనగా నిది మూలపురుషుని తెలుపుము. అకారము అన్యాక్షర సహాయ మపేక్షింపక అన్యాక్షరములకు మూలమైయుండిన స్వతంత్రాక్షరము. అది తెలుపు మూలపురుషుడును స్వతంత్రుడు మాత్రమే కాదు, సర్వతంత్ర స్వతంత్రుడై యున్నాడు. అకారమువలె మూలపురుషుడును ఇతరులకు కారణభూతుడు. అకారము యితరాక్షరములకు ఆధారమైనట్లే, మూలపురుషుడును చేతనములు అచేతనములు అన్నిటికి ఆధారభూతుడు. అకారము నాశనము లేనిది, మూలపురుషుడు నాశనరహితుడు, భూత వర్తమానములందు కలడు, భవిష్యత్తున నుండును. అ అను ధాతువునకు రక్షించుట యని అర్థము. అకారవాచ్యుడైన పురుషుడును రక్షించుటయే పరమ ధర్మమైనవాడు. జగత్తుకు చరాచరములకు శబ్దములకు రక్షకుడై యున్నాడు. సకల శబ్దములకు అకారము కారణము, పరమ పురుషుడును సకల జగత్తుకు చరాచరములకు శబ్దములకు కారణభూతుడై యున్నాడు.

'అ' అర్థబలముచేత శ్రియఃపతిత్వము (లక్ష్మీపతిత్వము) అను అర్థమును వ్యక్తము చేయుచున్నది. అకారమునందు వ్యాకరణ శాస్త్రానుసారము లుప్త చతుర్థియున్నది. కొరకు అను విభక్తి ప్రత్యయము వచ్చి సుప్రత్యయములకు సమస్త పదమైనప్పుడు లోపము వచ్చును. దీని వలన పరమాత్మకు శేషమని తెలియును. ఇట్లు అకారము సకల ప్రపంచకారణమై సర్వరక్షకుడైన వానిని తెలుపుచున్నది.

నేల నీరు తేజస్సు గాలి ఆకాశము అనునవి పంచభూతములు. దేవతలు మానవులు తిర్యక్కులు స్థావరములు అనునవి చతుర్వర్గములు. వాని వ్యాపారములన్నియు వేదశబ్దమైన అకార కారణముననే జరుగుచున్నవి. ఎందులకనగా నివి యన్నియు అకార శబ్దవాచ్యుడైన పరమాత్మ సృష్టించినవే. లౌకిక వైదిక శబ్దములకు కారణ మదియే. వేదములకు ఆది, ప్రణవమే. అందుకే

వేద పఠనము హరిః ఓమ్ అని ప్రారంభింతురు. అన్ని వేదములు ప్రణవమందే ముగియుచున్నవి. వేద సంస్కృత వాఙ్మయమంతయు ప్రణవమే. కావున ప్రణవమును నేర్చుటయన వీనిని నేర్చుటయే యగును. ఓంకార ప్రభావమే వేదము. అనగా వేదములు ప్రణవమున జన్మించినవే. అవి చాటిచెప్పునది ఓంకార ప్రభావమునే. ఉదాత్త అనుదాత్తాది స్వరములు దానినే కీర్తించుచున్నవి. అంతటి విశిష్ట ప్రణవము అకారమందు లయమై యున్నది. అకారమే వాక్కులు (పలుకులు)గ రూపొందినది. ఇట్లు అకారము శబ్దములకు మూలము ఆధారము కారణమునై యున్నది. అన్ని శబ్దములచే జెప్పబడువాడు పరమాత్మయే. అతని నామము వాచకమగుచున్నది. వీని సంబంధము నెఱుకపరచుట – విశదపరచుట – అకారము యొక్క సహజ లక్షణము స్వభావమునై యున్నది. అకారమెట్లు జగత్కారణమై యున్నదో తెలుసుకొనదగి యున్నది.

అకారవాచ్యుడైన పరమాత్మ – యింతవరకు వివరించినట్లు – సకల శబ్దములకు వలె సకలభూతములకును కారణమై యున్నాడు. అవి పరమాత్మ వలననే పుట్టి, జీవించుచున్నవి. అతడు సర్వేశ్వరుడు. సృజించువాడైనందున సృష్టికర్త. సంహరించువాడు, సంహరింపబడువాడు నతడే. రక్షించువాడు, రక్షింపబడువాడు నతడే. అతడు అకారముచే వ్యక్తమగుచున్నాడు.

కార్యమునకు ముందు నిశ్చయముగా కారణముండును. ఘటము చేయుటకు కుమ్మరి, మన్ను, దండ చక్రాదులు కావలెను. వీనిలో కుమ్మరి నిమిత్తకారణమై యుండగా, మన్ను ఉపాదాన కారణమగుచున్నది. దండ చక్రములు సహకారి కారణమై యుండ కుండ తయారగుచున్నది. వీనిలో కుమ్మరి చైతన్యము కలిగియున్నందున స్వతంత్రుడు. మన్ను చక్రము కఱ్ఱలు అస్వతంత్రములై యున్నవి. సృష్టించుటకు సృష్టింపబడుటకు నీ మూడును

అవసరము. అందులో పరమాత్మ అతని సంకల్పము నిమిత్త కారణము. అతని వలన సృష్టింపబడిన ప్రకృతి (పంచభూతములు) ఆత్మలు ఉపాదాన కారణము. యతోవా ఇమాని భూతాని జాయన్తే అనువాక్య ప్రకారము దేని నుండి అన్ని ప్రాణులు పుట్టుచున్నవో, ఎవని వలన జీవించుచున్నవో, ఎవరి వలన లయమగుచున్నవో అతడే పరమాత్మ. కనుక యీ మూడు కారములును పరమాత్మయే. అక్షరాణాం అకారోస్మి యను గీతావాక్యము దీనినే చెప్పుచున్నది. అకారము సర్వజగద్రక్షక మెట్లైనదో విచారింతము.

పరమాత్మ చరాచరాత్మకమగు జీవులను రక్షించుట రెండు విధములుగా నుండును. అనిష్టములను నివారించుట ద్వారా రక్షించుట, వారి వారి ఇష్టములను ప్రసాదించుట ద్వారా రక్షించుట. మొదటిదానిలో ఆశ్రితులకు దుఃఖము కలుగజేయు విరోధులను తొలగించి రక్షించును. రెండవదానిలో సుఖకరమైన జీవుల కోరికల నొసగి రక్షించును. చేతనుల కోరికలబట్టి, అధికారమునుబట్టి, వారి వారి స్థితిగతులనుబట్టి; విరోధులు అపేక్షితములు వేర్వేరుగా నుండును. జీవులను, సంసారులు ముముక్షువులు ముక్తులు నను ముివ్విధములుగా జెప్పుదురు. వీరిలో సంసారులు దేహమే ప్రధానమైనదని తలచువారు. ఆ దేహము ఎటువంటిది? పంచభూతాత్మికమైనది కదా! అనిత్యమై సుఖదుఃఖ సాధకమైనది కదా! ఆత్మ దాని నుండి వెడలిన తరువాత స్పృశించుటకు చూచుటకు భయమును అసహ్యమును కలిగించునది కదా! అజ్ఞానమును, అన్యథా జ్ఞానమును, విపరీత జ్ఞానమును కలిగించునది కదా! శబ్దము స్పర్శము రూపము రసము గంధము అనునవి పంచతన్మాత్రలు. వీనివలన విషయాను భావము కలుగును. అది స్వదేహ పోషణయే పురుషార్థమని తలచునట్లు చేయును. శబ్దాదులైన విషయ లాభములకు తగినట్లు – వర్ణ ఆశ్రమ ధర్మములను వదలునట్లు చేయును. సేవించదగిన వారిని సేవించక యుండునట్లు,

సేవించదగని వారిని సేవించునట్లు నుండజేయును. స్వధర్మమును వదల జేయును, స్వార్థమునకై హింసకు ప్రేరేపింపజేయును. పరాదారలను పరుల సొత్తును హరింపజేయును. సంసారమును వృద్ధి చేయును. పరమాత్మయందు వైముఖ్యము కలిగించును. ఇట్టివారు సంసారు లనబడుచున్నారు.

ఇక ముముక్షువులో? పరమాత్మ ప్రసాదించునది ముక్తి. దీనినే మోక్ష మందురు. మోక్ష మనగా మహానందమని శాస్త్రములు చెప్పుచున్నవి. ముముక్షువులు దానియందు కోరిక కలవారు. వారు దానిని పొందుటకు ప్రతిబంధకమైనది దేహము. మోక్షమునకు దేహము ప్రతిబంధకమైనదని తెలుసుకొని దాని నుండి నివృత్తిని కోరువారు ముముక్షువులు.

నిత్యులు లేక ముక్తులను మూడవ విధమువారు – ప్రాకృత దేహముల వదలి, తేజోరూపాది రూపములు ధరించి, సంసార బంధములులేక పరిశుద్ధులైనవారు, పరమాత్మానుభవమునకు తగినవారు; పరమాత్మ సంకల్పము ననుసరించి ఆయా పదవుల జేపట్టుటకు సమర్థులైనవారు, ఈ జగమును సృజించుటకు పాలించుటకు సంహరించుటకు శక్తి కలవారు; అయినను పరమాత్మ వ్యక్తమగు అన్నిచోటుల నిస్వార్థబద్ధులై పరమాత్మ సేవ చేయువారు. పరమాత్మ సాధారణ నివాసములు వైకుంఠ పాలసముద్రములు. నిత్యులైన వారిని కొందరి పేర్లను తెలుసుకొనుట తగియుండును.

ఆదిశేషుడు, గరుత్మంతుడు, విషక్సేనుడు, శంఖచక్రాది రూపముల ధరించి అవసరమగు నెల్ల తావులందు నమరియుండుచు దివ్యతేజోమయ రూపధారులు నిత్యులు. పరమాత్మ అనుగ్రహముచేత సంసార దుఃఖములను విడచి పరమాత్మ దివ్యరూపమును దివ్యమంగళ విగ్రహమును కళ్యాణ గుణములను వైభవమును మనసార అనుభవించువారు ముక్తులు. దానివలన కలిగిన ప్రీతిని మనసునందు యిమిడ్చి యుండుకొనలేనివారు. అందుచే పరమాత్మను స్తుతించి, దయా

హృదయుడైన పరమాత్మ నివాసమైన పరమపదమును పొంది సాలోక్య సారూప్య సామీప్య సాయుజ్య ముక్తి విశేషములను దివ్యానందము ననుభవించుచు నుందువారు. ఇక సంసారులు ముముక్షువులు నిత్యముక్తులను ముద్విధ చేతనుల యపేక్షలు, విరోధములు వాని నుండి రక్షణ విషయముల విచారణ చేయవలసి యున్నది.

సంసారుల అపేక్షలు అనేకములు. వీరికి విరోధుల వలన రాగలవి మనో వ్యాధులు శరీరవ్యాధులు. వీరి యపేక్షలు – వివిధాన్నములు, పానీయములు, అలంకరణకైన వస్త్రములు, నగలు, పువ్వులు, బంగారము, రత్నములు, మైపూతలు, ధనము, ఇండ్లు, భూములు, వాహనములు, ఆలింగనాదులు అనేకములు.

ముముక్షువులకు విరోధులుండునా? సంసారమునందుండలేక పరమ పదము జేరనపేక్షించువారు కదా ముముక్షువులు! అసత్యమగు దేహము నిత్యమను స్మృతి వీరికి మొదటి విరోధి. శబ్దము స్పర్శ వంటి పంచతన్మాత్రలను శరీరముతో ననుభవించుట రెండవది. శరీరముతో లీలావిభూతి యనబడు లోకములో భోగలాలసత యనబడు సంసార బంధము మూడవది. ఇది అల్ప సారము మాత్రమేకాక నరకతుల్యమునై యున్నది. వీరు కోరదగినది కోరునది కూడ పరమపదమును చేరుటయే. పొందగోరునది పరమాత్మనే. భగవంతునిచే ననుభవింపబడుట, భగవదానందము వీరు కోరునవి. అందుకు అనుకూల పరికరముగ మారి పరమాత్మ సన్నిధి యందుండుట వీరి యపేక్ష.

ముక్తులకు విరోధులుండరా? అపేక్షలుండవా? వీరు సంసార బంధము లేనివారు (వదలినవారు) కదా! అది లేశమైన లేనివారు. వీరికి ప్రాప్తశేషి, స్వామి పరమాత్మయే. ఆ పరమాత్మానుభవము వలన కలిగిన ప్రీతి కలవారే. అందువలన చేయునది కైంకర్యము – ఆ సేవకు రాగల విఘ్నములే విరోధులు.

అట్లు ప్రాప్తశేషియైన భగవంతుని పాదములందు తమకు అనుకూలమగు సేవ నిరంతరము సర్వవిధముల సర్వదేశములందు నెడతెగక ఆటంకములులేక నెరవేర్చుకొనుట యనగా కైంకర్యవృద్ధి వీరి యపేక్ష.

ఇట్లు ముప్విధులైన అధికారులకు – వారి వారి దోషములు నశింపజేసి, వారి కోర్కెలను పరమాత్మ తీర్చుచుండుటచే – అకారము వలన తెలియు పరమాత్మ సర్వరక్షకుడని దృఢముగా తెలియుచున్నది. పరమాత్మయేగాని లోకములో వేరు రక్షకులు లేరా? శరీరప్రదాతలు బంధువుల దేవతలవంటి అనేకులు కలరు – వారు రక్షకులు కాలేరా?

రామాయణము ఆదికావ్యము. అందులో కైక భరతుని కన్నతల్లి. రాజ్య లోభముచేత పుత్రునికి రాజ్యమిమ్మని కోరి, వానిని నానాకష్టముల పాల్జేసినది. రామాయణము కైకేయానందవర్ధనునిగా రాముని చెప్పినది. అంతటి ఆనందాతిశయముతో పెంచిన రాముని చివరకు అడవులకు వెడలగొట్టినది. భారతములో – లోకాపవాదమునకు వెఱచిన కుంతి – తన ప్రథమ సంతానమును గంగపాల్జేయలేదా? కనకాంగి యను అప్సర భార్గవునికి కన్నబిడ్డను, మేనక విశ్వామిత్రుని వలన కనిన బిడ్డను పొదరింటిలోను, చెట్టుక్రింద వదలిపోయిరి కదా! ఇన్ని ఉదాహరణ లుండగా కన్నతల్లిని రక్షక మనరాదు కదా!

హిరణ్యకశిపుడు నిర్దోషియగు పుత్రుని బాధలు పెట్టి హింసించెను. గౌతమ వంశీయుడగు ఉద్దాలకుడు తన పుత్రుడు నచికేతుని మృత్యువునకు దానమిచ్చెను. ఈ యుదాహరణలు తండ్రియు రక్షకము కాదని చెప్పుచున్నవి.

కిష్కింధాధిపతి యగు వాలి తన సోదరుని రాజ్యభ్రష్టుని చేయుటే కాక, మరదలు రుమను తీసుకొని, భూమియంతట వెంబడించి తరిమెను. లంకాధిపతి రావణుడు, తమ్ముడు విభీషణుని కులపాంసనుడని నిందించి నౌకరును వలె

వెడలగొట్టెను. దురభిమాని, రాజ్యలోభియునగు రారాజు దుర్యోధనుడు – తమ్ములు 99 మందికి చావు తెచ్చిపెట్టిన యుదాహరణలుండగా, అన్నను రక్షకుడనుట యెట్లు? తాను అన్నయంతటి శక్తిపరుడు కాకున్నను సుగ్రీవుడు తన అన్నను చంపి పీఠమెక్కెను, కనుక తమ్ముని రక్షకుడనుటయు చెల్లదు.

పాండవులైదుగురు సమర్థులై యుండియు – భార్య ద్రౌపది – నిండు సభలో దుశ్శాసనునిచే భంగపడుచున్నను, ఆమెకు రక్షకులు కాగలిగిరా? కనుక భర్తను రక్షకుడనుట యొప్పునా? విధివశమున రాజ్యము సంపద పోగొట్టుకొని అడవులపాలైన నలచక్రవర్తిని అనుసరించి యతని భార్య యుండగలిగెనా? పుట్టినింటికి చేరలేదా? ఇక భార్య రక్షకమగునా? బ్రహ్మచే సృజింపబడిన రుద్రుడు అవిధేయుడై తండ్రి తల యూడిపడునట్లు కొట్టెను. తండ్రి దైవసమానుడని చెప్పు సూక్తికి విరుద్ధముగ కంసుడు తండ్రిని చెరయందుంచగా, పుత్రుని రక్షకుడనుట, రక్షకునిగా మన్నించుట యెట్లు?

ప్రత్యక్ష దైవములని సంభావింపబడుచున్న సూర్యచంద్రులను గూర్చి విచారింతము. వారు రక్షకులు కాలేరా యను ప్రశ్న యుదయించును. వీరిద్దరు నమృత వినియోగ సమయమున గ్రహగతిని చెందిన రాహు కేతువులచే మ్రింగబడుచు తమను తామే కాపాడుకొనలేక యున్నవారు. ఇతరునేమి రక్షింతురు? సర్వేశ్వరుని యాజ్ఞాబద్ధులై గడియలు లెక్కపెట్టుకొనుచుండు పరతంత్రులు కదా! దురహంకారులైన హిరణ్యకశిప రావణులకు ఊడిగములు చేసిన వీరేమి రక్షింతురు?

ముల్లోకాధిపతియగు ఇంద్రుడు రక్షకుడు కావచ్చును కదా? దుర్వాస శాపోహతుడై సర్వమును పోనడచుకొన్నవాడు. బలిచే పరాభవమునంది చెట్లు పుట్టలు పట్టుకొని తిరిగినవాడు. గౌతమ శాపముచే మేనెల్ల యోనులై పరులకంట పడుటకు సిగ్గుపడుచు నుండువాడేమి రక్షించును?

త్రిమూర్తులలో నొకడగు రుద్రుడో? క్రూరకర్ముడై జీవసంహారమే వృత్తిగా

కలవాడు, కాళ్లు చేతులు తలలు నరుక్కొని వ్రేల్చిననేగాని ప్రసన్నుడు కానివాడు, బాణాసురుని రక్షింతునని మాటయిచ్చి వాడు 998 చేతులు కోల్పోగా నేమియు జేయలేక వాని కర్మమునకు వానిని వదలి మాటతప్పిన వాడు కదా! బ్రహ్మాహత్యా పాతకముచేసి దానిని వదలించుకొనుటకు పుట్టెతిండి తినుచు పరమాత్మ దయ తలచగా బయటపడినవాడేమి రక్షించును?

తన చేతి వేదములు పోగొట్టుకొని, బ్రహ్మ తిరిగి వానిని సంపాదించుకొనలేక నారాయణ కృపచేకదా తిరిగి పొందగలిగెను! వేదనేత్రములను వేద సంపదను కాపాడలేక తన ఆయువెప్పుడు ముగియునో యని కళవళపడుచు నుండువాడు – రక్షకుడు కాగలడా?

ధనమా, దొంగలపాలగునది. కామ సుఖములకు కారణమై జీవుని భ్రష్టుని చేయునది. రాజులచేత పాలకులచేత అపహరింపబడునది. జ్ఞాతుల పాలగునది. తల్లీ బిడ్డల, భార్యా భర్తల మధ్య కూడ విరోధముల సృష్టించునది. తరచు నీచుల యొద్దనుండునది రక్షకము కాలేదు కదా!

ఇంత వరకు పరామర్శించిన వారందరు విడచినను జీవులచేయి వదలని వాడు. జీవులు తనను మరచినను తాను వారిని మరువనివాడు సర్వేశ్వరుడు. తనను ఆశ్రయించిన వారిని రక్షించుటకు వారి రథము త్రోలుటకైన సిద్ధపడువాడు, ఆర్తులను రక్షించుటకు ఏ రూపమైనను, చివరకు చేప, పంది రూపముల నైనను ధరించువాడు, భక్తులకు విరోధులైనవారి బాణములకు తన రొమ్మునిచ్చి, భక్తుల రక్షించువాడు, ఆడితప్పనివాడు, సకల జీవులందు నుండి తన సొత్తగు ఆత్మలను రక్షించువాడు, అకారముచే చెప్పబడువాడు, పరమాత్మ సర్వేశ్వరుడునైన నారాయణుడు మాత్రమే సర్వజీవ రక్షకుడు కాదగి యున్నాడు; నారాయణ మంత్రము శ్రియఃపతిత్వము నెట్లు ద్యోతకము చేయుచున్నది?

కారుణ్య స్వరూపిణియు పట్టమహిషియునైన లక్ష్మీదేవితో కలసి యున్నపుడు

హృషీకేశుడు సర్వేశ్వరుడు నగు నారాయణుడు రక్షకుడగుచున్నట్లు వేదాంతములు సిద్ధాంతీకరించినవి. రక్షణ యనుటచే నర్థబలముచే శ్రియఃపతిత్వము వ్యక్త మగుచున్నది. హృషీకములనగా నింద్రియములు. వానిని నియమించువాడు హృషీకేశుడు. బ్రహ్మాదుల యింద్రియములును నీతని యధీనమై యున్నందున పరమాత్మ అపరిచ్ఛేదుడైనాడు. ఈ విషయమును హరివంశము చెప్పుచున్నది. అకార స్వరూపుడు రక్షించువాడు నతడైయుండ లక్ష్మీదేవి ప్రసక్తి యెందుకు?

సర్వేశ్వరుడు రక్షకుడు నిరంకుశుడునై యుండగా, చేతనుడు సాపరాధి. అపరాధములు చేయువాడు, చేసినవాడునై యున్నాడు. వానిని చూచిగాని, తన స్వాతంత్ర్యతచే గాని ఉపేక్షింపక, జీవుని రక్షించుటకు కారణమైన కారుణ్యమును ప్రక్కకు పెట్టునపుడు, దానిని స్వామియందు తిరిగి కలిగించుటకు లక్ష్మీదేవి కారణమగుచున్నది. ఈ పురుషకారమున కామె సామీప్యము కావలసి యున్నది. ఈ సామీప్యమును విశిష్టాద్వైతము సాన్నిధ్య మనుచున్నది. ఈ రెండును పర్యాయపదములే. శ్రీదేవి పురుషకారము జీవులను రక్షించుటకు సహాయకారియై యున్నందున, అకారమునకు గల యర్థమును బట్టి ఆమె యునికిని అనుసంధించక తప్పదు. స్వామి లక్ష్మీపతి యనియు, లక్ష్మి విష్ణుపత్ని యనియు సార్థకనామములు కలిగి యున్నారు కదా! లక్ష్మిని శ్రీయని సూత్రీకరించుట యెందుకు? శ్రీ శబ్ద వ్యుత్పత్త్యర్థమును బట్టి ఆశ్రయించున దామె. ఎవరిని? పరమాత్మను. ఎట్లు? క్షణమైన నెడబాటులేక, సేవజేయగోరినదై, ఆశ్రయించి యుండునది.

మరియొక వ్యుత్పత్త్యర్థమును బట్టి శ్రీ శబ్దము ఆశ్రయింపబడునది యని యర్థము. జీవులచే నెల్లపుడు నాశ్రయింపబడునది. కనుక అకారము నందు శ్రీ సంబంధము సిద్ధమగుచున్నది. ఆతనియందు 'లక్ష్మి యున్నది, ఉండుచున్నది' కనుకనే నారాయణుడు లక్ష్మీవాన్, శ్రీనివాసుడు ననబడుచున్నాడు. అతడు

తన వక్షస్థలము నామెకు నివాసముగ నిచ్చిన సార్థక నామము కలవాడై యున్నాడు. ఈ సంబంధమామెకు నిత్యము అగుటచే, పరమాత్మ తోచు నన్నిచోటుల యందు ఆమె కూడ తోచుట నిశ్చయము. అందుచే అకారసంబంధ మామెకును నిత్యమని సత్యమని ధృవీకరింపబడియున్నది.

రామాయణమున సుందర కాండయందు జానకీదేవి రావణునితో నిట్లనును. "రావణా! నేను ఐశ్వర్యముచేగాని, బంగారము ధనము భోగములచే గాని వంచింపబడుదానను కాను. సూర్యుని నుండి కాంతి యెట్లు వేరై యుండదో అటులనే నేనును నా స్వామి నుండి వేరైనదానను కాను". సూర్యునికి కాంతికి మధ్య పృథక్ స్థితి లేనట్లు – సీతారాముల కెడబాటులేదు. యుద్ధకాండ యందు వేరొక వాక్యమున్నది. బ్రహ్మాది దేవతలతో శ్రీరామచంద్రుని వాక్యమది. "సూర్యుని కంటె సూర్యకాంతి వేరుకాదు కదా! అట్లే నా నుండి సీత వేరు కాదు. సూర్య సూర్యకాంతు లెట్లు వేర్పరచరానివో, మా యిరువురకు వేర్పరచలేనంత నిత్య సంబంధము కలదు. జనకరాజ పుత్రి ముల్లోకముల పవిత్రురాలు". ఈ భావమునే విష్ణుపురాణము (2-7-19) చెప్పుచున్నది. రామాయణము వేదోపబృహింతమైనది. అందు సీతారాము లిర్వురు నిదే భావమును వ్యక్తపరచిరి.

పుష్పము పరిమళములకు మధ్య నెడబాటు లేదు. పూవును విడచి తావి యుండదు. అకారమును అనగా పరమాత్మను విడచి శ్రీశబ్ద వాచ్యురాలగు లక్ష్మీదేవి యుండదు. ముముక్షుప్పడి యను తమిళ గ్రంథమిట్లు చెప్పుచున్నది. తన భర్త శయ్యకును బిడ్డ ఊయలకును మధ్య ఆ బిడ్డ తల్లి యెందుకు శయనించును? భర్త కోరికను తన స్వరూపమునకు తగినట్లు సమకూర్చి ఆనందింప జేయుటకును, స్తన్యమిచ్చి బిడ్డ ఆకలిని తీర్చుటకును కదా! పరమాత్మ యొద్దజీవులకు స్వామికి మధ్య – జీవులకు జ్ఞానమిచ్చి రక్షించుటకు శ్రీదేవి నిలచియున్నది. పరమాత్మ సంకల్పము దీనివలన నెరవేరును.

స్వామి అకారముచే ప్రతిపాదింపబడువాడు. జీవుడు మకారముచే ప్రతిపాదింపబడువాడు. అ ఉ మ కలసి ప్రణవము కాగా, జీవేశ్వరుల మధ్య ఉకార శబ్దవాచ్యురాలై శ్రీదేవి నిలచి యున్నది. కనుక అకారములో పరోక్షముగ శ్రీ సంబంధ మిమిడి యున్నది. ప్రత్యక్షముగ అకారము ప్రక్కనే శ్రీ సంబంధ ఉకారము నిలచి యున్నది. అకారము భర్త తండ్రి యజమాని స్వరూపములను తెలుపు పరమాత్మను ప్రతిపాదించు చుండుటచే, చేతనులు అతనిచే నిశ్చయముగ రక్షింపబడుదురు. కావున నతనికే దాసులు శేషభూతులై యుండవలెను. ఇపుడు పరమాత్మకు మాత్రమే కాక లక్ష్మీదేవికి కూడ శేషభూతులై జీవులెందుకు ఉండవలెను? అను సందేహము కలుగవచ్చును.

లోకములోని ఒక వాదును పరిశీలించుదము. ఎవడే నొకడు భృత్యుల నేర్పరచుకొనునప్పుడు, యజమానియైన తన పేర పత్రము వ్రాయించి పుచ్చుకొనునేగాని తన భార్య పేరున కాదు కదా! అయినను భృత్యుడు లాభము పొందుటకు యజమాని భార్యకును దాస్యము చేయును. ఆమె చిత్తానువర్తియై మెలగును. అది యజమానికి ఆమోదయోగ్యమై యుండును. అట్లే పరమాత్మకు దాసభూతులగుజీవులు లక్ష్మీదేవికిని శేషభూతులై యుండవలసి యున్నది. శ్రీ శ్రియఃపతుల చేరికయే జీవులకు తరుణోపాయమై యున్నది.

ఆ దంపతులలో ఒకరిని విడచి మరొకరిని అభిమానించుట, చేరుట, ఆదరించుట జీవులకు తారకము కాదు. రాముని మాత్రమే కోరి, జానకిని విడచిన శూర్పణఖయు, రాముని వదలి జానకిని కొనిపోయిన రావణుడును అనర్థములను పొందిరి. జానకిని అభిమానించి, రామపాద శరణాగతుడైన విభీషణుడు సర్వశ్రేయములను పొందియుండుట యిందుకు తార్కాణమై యున్నది. రామాయణ సుందరకాండలో మరియొక ఉదాహరణ కలదు. ఇంద్ర పుత్రుడగు జయంతుడు కాకి రూపమున వచ్చి మైథిలి యెడ అపచారము

చేసెను, ఆమెను బాధించెను. రాముడా కాకిపై బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. వాడెందును రక్షించువారులేక తిరిగివచ్చి రామపాదముల శరణు కోరెను. కృపామాత్ర స్వరూపయగు వైదేహి పురుషకారముతో రాముడా కాకమును రక్షించెను. కనుక శ్రీ శ్రియఃపతుల నిద్దరను ఆశ్రయించుట సుఖదాయకము. ఆనందదాయకమునై యున్నది. అంతేకాక రక్షకమై యున్నది. ఇంతకు ముందు ప్రస్తావించిన నారాయణ శబ్దమందలి విభక్తిని గురించి మరికొంత పరిశీలించుట మంచిది కదా!

అకారము నందు 'కొరకు' అను విభక్తి (చతుర్థీ) వచ్చి 'సుపాంసులుక్' అను సూత్రానుసారము లోపించుచున్నది. అందుచే యీ అకారమునందు లుప్త చతుర్థీ విభక్తి యున్నది. దీనిచే అకార స్వరూపుడైన నారాయణుని కొరకే యీ జీవుడు శేషభూతుడని తెలియుచున్నది. అకార వివరణ 'నారాయణాయ' యని కదా! దాని సంగ్రహరూపము అ కదా! నారాయణాయలోని అయ యను చతుర్థీ విభక్తి అ లో నుండిననే ఆ యర్థము స్ఫురించును కదా యనిన – స్థూల సూక్ష్మరూపముల యందు ధర్మములు సామాన్యములు. బెల్లపు తీపి, పానకమున; పానకపు తియ్యదనము బెల్లమునందు నుండును. అట్లు నారాయణాయ పదమందలి అయవిభక్తి అకారమునందు లోపించియున్నది. ఇట్లు తాదర్థ్యమున వచ్చిన చతుర్థి యగుటచే సర్వేశ్వరునికే యీ చేతనులు శేషభూతులని తెలుపుచున్నది. శేషభూతులనగా – దాసభూతులు లేక సేవకులని యర్థము. దాసత్వము దుఃఖదాయకము కాదా?

పరాధీనమున నుండుట దుఃఖకరము. జీవనమున కనేక పద్ధతులున్నవి. ఉంఛవృత్తి, పరిగయేరుకొని జీవించుట, అయాచిత భిక్షా జీవనము, వర్ణాశ్రమోచిత కృషిచే జీవనము, వాణిజ్యము, సేవకావృత్తి జీవనము వంటి జీవన మార్గములున్నవి. లోకన్యాయమునుబట్టి దాసత్వ జీవనము దుఃఖకరమే,

కాని అభిమత విషయమున మాత్రమట్లు కాదు, ఆనందదాయకమే యగుచున్నది. లోకమున నభిమత స్త్రీవిషయమున చేయు సేవ సుఖకరముగ నుండుట లేదా? కారణము – ఆ స్త్రీయందు గల సౌందర్యము ఆకర్షణ ఆమె యిచ్చు ఆనందము మొదలగు గుణములు. చేతనులను రక్షించుటకు కావలసిన వాత్సల్యము సౌశీల్యము స్వామిత్వము సౌలభ్యము జ్ఞానము శక్తి ప్రాప్తి పూర్తి వంటి కళ్యాణ గుణములచే వచ్చిన శేషత్వము ఆత్మల సహజ స్వరూపము. స్వామిగా నుండుట పరబ్రహ్మ సహజ లక్షణము.

బంధ మోక్ష దశలు వేనిలోనైనను జీవాత్మలు పరమాత్మకే దాసభూతులు, స్వతఃస్సిద్ధ దాసభూతులు అని శాస్త్రములు చెప్పుచున్నవి. ఆత్మజ్ఞాన ఆనంద స్వరూపము. దానికి శేషత్వమే లేకున్న దాని స్వరూపమే లేకుండును. ఎట్లనిన పరతంత్రతయే దాని ఆత్మలక్షణము. అది లేపుడు స్వతంత్రుడ నను భావము తప్పదు. స్వతంత్రుడు పరమాత్మ మాత్రమే. అతని స్వతంత్రతను జీవు డపహరించి తెచ్చుకొనుట, ఆరోపించుకొనుట దోషము, చౌర్యము నగుచున్నవి.

లభ్యమగుచున్న ప్రమాణములను బట్టి – అన్ని పాపములకు మూలము ఆత్మాపహారము. పంచమహాపాపములకు ప్రాయశ్చిత్తములున్నను, దీనికి పరిహారము లేదు. తన పరతంత్రత వదలి సర్వేశ్వరునిదైన స్వాతంత్ర్యతను పరిగ్రహించ జూచుట నిశ్చయముగ ఆత్మాపహారమే. పంచమహాపాతకము లనగానేవి? బ్రహ్మహత్య సురాపానము గురుపత్నితో పొందు స్వర్ణస్తేయము అను నాలుగు కాక, ఐదవది – పై నాలుగు పాపములు చేసినవారితో నెయ్యము. ఈ చెప్పిన అన్ని కారణముల పర్యవసానము శేషత్వమే. ఆత్మకు సహజ స్వరూపము. శేషత్వ జ్ఞానము లేనిచో స్వరూపమే లేదు అని లుప్త చతుర్థి తెలుపుచున్నది. ఓంకారము తెలుపు రెండవ యక్షరము ఉ కారము యొక్క అర్థమేమి?

*     *     *

జ్ఞానానంద స్వరూపుడగు నారాయణునికి అకారము వాచకము కాగా చిత్స్వరూపురాలైన లక్ష్మీదేవికి ఉకారము వాచకమై యున్నది. చిత్ అచిదాత్మక మైన విభూతి యందు ప్రవేశించువాడు విష్ణువని – అతడు చరాచరాత్మకులగు జీవుల యందు ప్రవేశించి యుండువాడని, ఆ ప్రకృతి యందు తానే అను ప్రవేశము చేయువాడని, జీవుల కేవేవి కావలయునో వానిని తక్షణమే యిచ్చువాడని – విష్ణు శబ్దవిచారముచే తేలుచున్న విషయములు, శ్రుతి వీనినే తెలుపుచున్నది. ఆశ్రయించువారి విఘ్నముల దొలగించువాడు అని, దుర్బుద్ధితో తలచినను – తలచినవారి పాపముల పోనడచువాడనియు హరిశబ్దార్థము తెలుపుచున్నది. నిత్యవస్తు సమూహము ఆశ్రయముగా గలవాడని, వానికి ఆధారమైన వాడని, అకారముచే లోకముల శాసించువాడని, సర్వవ్యాపియని హరి విష్ణు నామములు కల నారాయణుడు చెప్పబడుచున్నాడు. అట్టి మహా విష్ణువుచే నెల్లపుడు వక్షమందు ధరింపబడు లక్ష్మీదేవి ఉకారముచే చెప్పబడు చున్నది యని శ్రుతులు ఘోషించుచున్నవి.

ఆయా అక్షరములు ఎచట నుండవలెనో, వాని కృత్యమేమో, వాని సహజ సంబంధమేమో అను విషయములు నిర్ధారణగ, సంశయముగాని విపర్యయము గాని లేకుండ తెలుపదగిన ప్రమాణమును – స్థలము అందురు. ఈ సందర్భములలో వేదభాష యందు ఏవ, ఉ అను పదములు వాడబడుచున్నవి. శ్రుతులలో తదేవ అనుచోట తత్+ఏవ; తదు అనుచోట తత్+ఉ అను పదములు అగుచున్నవి. ఏవ ప్రయోగించు స్థలమందు ఉకారపు యోగము చేయబడు చున్నది. స్థానప్రమాణ బలముచే ఉకారము అవధార మను అర్థమును తెలుపుచున్నది. అవధారణ మనగా సర్వదా సంబంధము కలిగియుండుట – ఇతరులతో సంబంధము లేకుండుట.

అకార మకారముల మధ్యనున్న ఉకారము సప్రమాణముగ నేమి

బోధించునో తిరుగ సూక్ష్మవిచారము చేసి ముందుకు పోవుట యుక్తము. ఆత్మ పరతంత్రజీవుడు. అనగా అకార స్వరూపుడైన పరమాత్మకు శేషభూతుడని, అకారముచే చెప్పబడు పరమాత్మ – మకారముచే చెప్పబడు జీవునకు శేషియని (లేక స్వామియని) – ఇట్లు పరమాత్మకు శేషముగానున్న ఆత్మ – తనకు గాని, యితరులకు గాని శేషము కాదనియు తెలుపుచున్నది. లోకములో నొకనికి శేషమైయున్న పుత్రులు దాసులు మొదలైనవారు మరికొందరికిని శేషమై యుండుట కలదు. అటువంటి అన్యశేషిత్వము నిశ్చయముగా నిచట లేదని ఉకారము తెలుపుచున్నది.

అకారమున లుప్త చతుర్థీవిభక్తి యున్నట్లు తెలుసుకొని యుంటిమి. ఆ విభక్తికి పైనున్న ఉకారముచేత, ఉకారముచే చెప్పబడు లక్ష్మీదేవికి, మకారముచే చెప్పబడు జీవుడు దాసభూతుడని తెలియుచున్నది. అంతేకాదు పరమాత్మ జీవాత్మలకు భర్తృ భార్యాసంబంధము కలదని తెలియుచున్నది. వీనిలో మొదటిది స్వాతంత్ర్య లక్షణమును తరువాతది పారతంత్ర్య లక్షణమును కలిగియుండి అనన్యార్హ సంబంధము సహింపరానిదని తెలుపుచున్నది. ఈ చెప్పినవాని సారము – జీవుడు పరమాత్మకు లక్ష్మీదేవికి శేషుడు కనుక ఇతరులకు దాసభూతుడుగ (అన్యశేషత్వము) నుండుటను ఉకారము నివర్తించుచున్నది. ఇందు భగవంతునికి శేషభూతుడనుట యెంత ప్రధానమో ఇతరులకు కాదని చెప్పుట అంతకంటె ముఖ్యమై యున్నది.

ఇందుకు ఒక ఉదాహరణ నిచ్చుట యోగ్యమగును. యజ్ఞములందు హవిస్సు దేవతలకు ప్రియమైనది. ఈశ్వరునికి శేషభూతమైనది ఆత్మవస్తువు. దానిని యితరులకు శేషభూతము చేయుట – శునకమునకు హవిస్సు నిచ్చుట వంటిది. అన్యశేషత్వమును ఉకారము నివారించుచున్నది. ఆత్మ సర్వేశ్వరుని కంటె వేరైన వానిలో నొకటియే కదా! అందుచేనది తనకు తాను కాని చైతన్య స్వరూపములైన యితర వస్తువులకు గాని శేషభూతము కాదు.

యముడు తన కింకరులతో జెప్పిన విషయములో నొక విశేష మున్నది. సర్వేశ్వరనామ ముచ్చరించకున్నను దోషము లేదు. కాని యితర దేవతల నామోచ్చారణ, ఆ దేవతల భజన దోషములు. ఆ దోషములు చేయనివారు భగవద్భక్తులు లేక భాగవతులు. వారి చెంతకు పోవలదని యముడు తన కింకరులకు చెప్పిన రహస్యము. భార్యకు భర్తతో సరిపడకపోవచ్చును. సరిపడినప్పు డాతనిని చేరవచ్చును. కాని పరపురుష సంపర్కము కల భార్యను ఆమె భర్త యొల్లడుకదా! సర్వేశ్వర శేషవస్తువైన ఆత్మకు – స్వశేషత్వముకాని అన్యశేషత్వము కాని నిందితములే. ఉకారము ఆత్మనాశకమగు అన్యశేషత్వమును నివర్తించుచున్నది.

*　　*　　*

మకారమునకు ఆత్మయనియు జ్ఞానమనియు తెలుసుకొనుటయనియు అర్థములుండుటచే – జ్ఞాన వాచకముగ నున్నది. మకారవాచ్యుడు 25వ వాడు, పురుషుడు, ఆత్మయని పిలువబడువాడు. ఆత్మజ్ఞానము అను గుణము కలవాడు. జ్ఞానము స్వరూపముగ కలవాడు అని శాస్త్రవాక్యములు తెలుపుచున్నవి. బ్రహ్మ సూత్రములు జ్ఞానగుణసారమైన ఆత్మస్వరూపమునకు మకారము వాచకమని తెలుపుచున్నవి. వీని అన్నిటి సారముగ మకారము జ్ఞానగుణము కల ఆత్మయని చెప్పవచ్చును. దానికి శేషభూతత్వ ధర్మమున్నది.

వ్యాకరణ శాస్త్ర ప్రకారము అ నుండి ఔ వరకు గల అక్షరములు ప్రాణములు. క నుండి మిగిలిన యక్షరములు వ్యంజనములు. వ్యంజనములకు స్వయముగ పలుకుబడి లేదు. ప్రాణములు చేరిననే వానికి ఉచ్చారణా సౌలభ్యము కలుగును. అకారము ప్రాణము. ఇది స్వతంత్రాక్షరము. మకారము వ్యంజనము, అస్వతంత్రము. మ్ అను వ్యంజనము అకారముచేరి మ అయినది. కనుకనే అస్వతంత్రమగు మ్ అనగా ఆత్మ – స్వతంత్రమగు అ అనగా పరమాత్మ

సంబంధములేక నిలువజాలదు. మకారము 25వ వాడని చెప్పుట ఎట్లు? 'క' నుండి 'మ' వరకు గల వ్యంజనములు క చ ట త ప అను ఐదు వర్గములు. ఒకొక్క వర్గమునకు ఐదేసి అక్షరములు, మకారము ప వర్గములోని చివరి యక్షరమైనందున 25వ వ్యంజనమైనది. మిగిలిన వ్యంజన వర్గములు వేనిని సూచించునో సమీక్షించుట యోగ్యము కదా!

| | | |
|---|---|---|
| క వర్గములోని 5 అక్షరములు | – | ఐదు భూతములకు (పంచభూతములకు) గుర్తు |
| చ వర్గములోని 5 అక్షరములు | – | నాలుక మొదలగు ఐదు కర్మేంద్రియములకు సంకేతము |
| ట వర్గములోని 5 అక్షరములు | – | చర్మము మొదలగు ఐదు జ్ఞానేంద్రియములకు ఆనవాలు |
| త వర్గములోని 5 అక్షరములు | – | శబ్దాదులైన ఐదు తన్మాత్రల సూచకములు |
| ప వర్గములోని మొదటి 4 అక్షరములు | – | మనోబుద్ధి అహంకారపు కృతులకు గుర్తు |

కాగా, ప వర్గములోని చివరి యక్షరము, వ్యంజనాక్షరములలోని 25వ యక్షరమునైన మకారము ఆత్మ లేక జీవుడు లేక చేతనుడై యున్నది. అది ఆత్మ వస్తు వాచకమని చెప్పబడినది. ఇది సమిష్టి వాచకము. మకారము సమిష్టి వాచకమెట్లైనది?

ఆత్మలకు శేషత్వము సాధారణ ధర్మమైనందున బద్ధులు, నిత్యులు, ముక్తులు నను ముఞ్విధములైన ఆత్మ సమూహములకు యీ మకారము వాచకమే. కనుక నిది సమిష్టి వాచక మనదగి యున్నది. ఇది భగవంతునికే అర్హమైన 25వది, తత్వజ్ఞానానంద స్వరూపము. జ్ఞాన గుణకత్వ స్వరూపము కల జీవాత్మల

సమూహమును చెప్పుటచే జాత్యేకవచనమని తెలియుచున్నది. జాత్యేకవచన మనగా నేమి?

ధాన్యాదుల రాశులను చెప్పుటలో నిది కందుల రాశి, నిది స్వర్ణ రాశి యని చెప్పుదురు. వీనిలోనే రాశియందైనను లక్షలాది గింజలుండును. అట్లే మకారము నిత్యులనబడు ఆత్మల ముక్తులనబడు ఆత్మల బద్ధసంసారులగు జీవుల వంటి పలు విధ జీవుల దెలుపును. రాశి పదము ఏకవచనమే. కాని అది ఆ రాశిని తెలుపును. అట్లే మకారము నందలి ఏకవచనమును – ఆత్మ జాతిపరమైన ఏకవచనము. పర్యవసాన మేమనగా, 1) ఆత్మజ్ఞానము కల 2) 25వ దగు మకారముచే చెప్పబడు 3) శేషత్వమునకు ఆశ్రయమగు 4) అచేతనుల నుండి భిన్నమగు వారిని మకారము చెప్పుచున్నది.

ఇది ప్రకృతి కంటె పరము స్వయంప్రకాశకము నిత్యమునైనది. శరీరము లందు వ్యాపించునది అయినను దేహములకంటె భిన్నమైనది, స్వాభావిక సుఖము కలది, ఆత్మయని చెప్పబడుచున్నది. అంతేకాదు – ఆత్మపరతంత్రమైనది. ఆ పారతంత్ర్యము సర్వేశ్వరునికే యని మకారమందలి చతుర్థీ విభక్తి తెలుపుచున్నది. ఇట్లు జీవుని స్వరూపము శోధనము చెప్పుటచే మకారము జీవవాచకమైనది. ఆత్మ విషయము ముందు చెప్పి, ఆ తరువాత దాని లక్షణములైన ధర్మములను తెలుపవలసి యుండగా, ఉకారముచే ఆత్మయొక్క శేషత్వ ధర్మము ముందుగా చెప్పి, తరువాత ఆత్మను చెప్పుట ఎందుకు?

పరిమళమును బట్టి పుష్పమును, కాంతినిబట్టి రత్నమును గుర్తించుట లోక మర్యాద కదా! పరిమళ కాంతులబట్టి వాని నాదరించుటయు గలదు. అట్లే శేషత్వమును బట్టి ఆత్మను గుర్తించి గౌరవించుట మర్యాద యగును. పరమాత్మను ఆశ్రయించుట దేనినిబట్టి? శేషిత్వమునుబట్టి కదా! శేషత్వ భావన లేని ఆత్మాపేక్ష వ్యర్థమగును. కనుకనే ఆత్మలక్షణమైన శేషత్వము చెప్పి, ఆ

వెనుక మకారము లేక జీవుడు చెప్పబడుచున్నాడు. నారాయణ మంత్రమందలి నమః పదము యొక్క అర్థమేమి?

* * *

ప్రణవము నందలి ఉకారము యొక్క అర్థము నమః పదము వలన విశదమగుచున్నది. దీనిలో రెండు పదములు న యనియు – మః యనియు కలవు. మనఃజ్ఞానే యను ధాతువు వలన షష్ఠీవిభక్తి ప్రత్యయము వలన మకారముచే చెప్పబడు ఆత్మ తనకు తాను శేషభూతుడని తోచవచ్చును. న యనునది పదమే కాదు, అక్షరము కూడ. నిషేధమును చెప్పు నఙ్చేత ఆ స్వాతంత్ర్యము నిషేధించబడుచున్నది. కనుక యీ రెండు పదముల చేరిక వలన ఆత్మ యితరులకు శేషభూతుడు కాదనుట తెలుపబడుచున్నది. ఇతరులకు శేషమను భావము కలిగినపుడు సర్వేశ్వరునికి గల సర్వరక్షకత్వము సర్వశేషిత్వము సర్వకళ్యాణగుణకత్వము వంటి విలక్షణ గుణములను చూపి – అట్టి అన్య శేషత్వము నుండి ఆత్మను మరల్చవచ్చును.

తనకు తానే శేషభూతుడనని అనుకొని యుండువానితో "నీవు నాకు శేషభూతుడవు" అనినచో వాడు "కాదు, నాకు నేను శేషభూతుడ" ననునే కాని భగవత్శేషభూత్వము నంగీకరించడు. అటువంటి భావన నుండి జీవుని నివర్తింపజేయు నవకాశమును నశించును. కనుక నమః అను పదము మః అను మకారమును, మమకారమును అహంకారమును; మమత్వప్రతిపత్తిని అహంకారప్రపత్తిని నివర్తింపజేయును. భారత శాంతిపర్వము (13–14) మమ యను రెండక్షరములు మృత్యుతుల్యములు సంసారాత్మకములు ననుచున్నది. నమమ యనునది శాశ్వత బ్రహ్మపదము. జీవాత్మకు అహంకార మమకారములు నాశన కారణములు. వీని నివృత్తియే ఉజ్జీవ కారణము. మః (నేను నాది) యనుకొనుట ఆత్మస్వరూప నాశన కారణమగుచుండగా, నమమ (నేను కాదు

నాది కాదు) అనుకొనుట ఆత్మస్వరూప లాభమగుచున్నది తరణ మార్గము – అనగా మోక్షమార్గమై యున్నది.

ఈ కారణము వలననే కర్మకాండలో హోమ హవ్వ సమర్పణ సందర్భమున 'ఓం కేశవాయ స్వాహా, కేశవా ఇదంనమమ' ఈ విధముగా చెప్పుదురు. దీని వలన తాను చేయు కర్మకాండ అంతయు సర్వేశ్వరుడైన కేశవునకే యని నమః పదము దృఢీకరించుచున్నది. అంతేకాదు, యీ పదము విరోధి నివర్తనమును చేయుచున్నది. అది ఎట్లు? విరోధులెవరు? విరోధి నిరసన మెట్లు? విరోధులలో మొదటిది స్వరూప విరోధి 'నేను, నాది' యను తలపు. దానిని నివర్తించుట యనగా, నేను అనబడు ఆత్మ కాని, నాది యనబడు ఆత్మవసువు కాని సర్వేశ్వరునికి శేషభూతులు. ఆయనకే విశేషములను భావము కలుగజేయుట. రెండవది యగు ఉపాయవిరోధి యనగా తనను – అనగా ఆత్మను తానే రక్షించుకొనగలనను భావము. దానిని నివర్తించుట యనగా 'హే! సర్వేశ్వరా! నీవు రక్షించినను, కాకున్నను నాకు నీవుకాక వేరుగతి లేదు. వేరెవరును ఉపాయము కాదు; నా సంసార దుఃఖమును హరించినను హరించకున్నను నీవుకాక వేరొక రక్షకుడు లేడు' అను విశ్వాసముతో నుండుట.

'అన్యధా శరణం నాస్తి' అను శ్లోకము చెప్పునది దీనినే. దీనిని ఏకోపాయ నిష్ఠ యందురు. మూడవది ప్రాప్యవిరోధి. 'నేను భగవంతుని అనుభవించు చున్నాను, ఈ అనుభవ విశేషము నాది' అని భ్రమించుట. అనగా స్వప్రయోజన బుద్ధి కలిగియుండుట. 'అహమన్నం భవాన్భోక్తా' అను వాక్యానుసారము జీవుడు పక్వాన్నము. సర్వేశ్వరుడు భోక్త. అన్నఫలము భుజించువానిదే గాని, అన్నమునకు లేదు కదా! అట్లే పరిశుద్ధమైన ఆత్మవలన ఫలము సర్వేశ్వరునకే గాని తనకు కాదు. ఈశ్వరముఖ వికాసమునకే గాని, ఆనందము తనకు కాదు. ఒకవేళ తనదే నను భావము కలుగునేమో! అపుడు నమః అనవలెను. ఆ ఆనందము

నాకు కాదు, నేను నాకు కాదు. మరి యెవరికి? నారాయణాయ – సర్వేశ్వరుడైన నారాయణునికే. నమఃపదము కాకాక్షి న్యాయముచేత ఓమ్ అను ప్రణవముతో సమన్వయించుచు స్వరూప విరోధిని దూరము చేయుచున్నది. మరియొకప్పుడు తరువాత పదమైన 'నారాయణాయ'తో నన్వయించి ప్రాప్యవిరోధిని నివర్తించు చున్నది. కాకాక్షి న్యాయమనగా నేమి?

కాకి రెండు కన్నుల మధ్య నొకే దృష్టిగోళ ముండును. కాకి యేవైపుకు చూచిన ఆ వైపుకు ఆ గోళము ప్రవర్తించి దృష్టినిచ్చునని మన ప్రాచీన సాహిత్యము చెప్పుచున్నది. ప్రసిద్ధ సంస్కృత న్యాయములలో కాకాక్షి న్యాయ మొకటి. ఈ న్యాయమందలి కాకి దృష్టి గోళమువలె, నమః పదము కూడ రెండువైపుల పదములకు నన్వయించుచున్నది. విరోధులను నివర్తించుచున్నది. కన్ను స్థానమున గల నమః స్వరూప జ్ఞానమును పురుషార్థ జ్ఞానములను విశదీకరించు చున్నది. ఇంతకు ముందు వాడిన స్వరూప పురుషార్థ ఉపాయ పదముల అర్థమేమి?

స్వరూప పదము – సర్వేశ్వరునికే నమస్కరింపుమని చెప్పుటచే ఆత్మ స్వరూపమిదియని తెలుపును. ఉపాయపదము – శ్రియఃపతికి నమస్కారమని ఆ శ్రియఃపతికి నేను శేషభూతుడనే గాని నాకు కాదు అని తెలుపుచు, తనను తాను రక్షించుకొనలేని పరతంత్రతను, శ్రియఃపతియే మోక్షమునకు ఉపాయమని స్పష్టీకరించుచున్నది. నారాయణ మంత్రములోని మూడు పదముల చివర (ఓమ్ నమః, నమోనమః, నారాయణాయ నమః) పలుకవలసినది నమః. దాస్యరసాభివృద్ధితో చరమదశ యందు చెప్పవలసినది దానినే. అందువలన పురుషార్థమను ఫలము తెలుపబడుచున్నది.

మరియొక ప్రధాన భావమును కూడ యీ నమః పదము తెలుపుచున్నది. ఈ పదము వలన అంతిమ అవస్థయగు భాగవత శేషత్వము – అర్థబలముచే

సిద్ధించుచున్నది. భగవత్ అనన్యార్హ శేషత్వము – భాగవత పర్యంతము ఐననే కాని, జీవునికి స్వరూపసిద్ధి కలుగదు. ఈ మంత్రాభ్యాసము వలన శ్రియఃపతికే కాక, అతని దాసులకును దాస్యము చేయవలయునను అధ్యవసాయము కలుగును. తద్వారా యీ పదము జీవుని అహంకారమును మమకారమును తొలగించి, భగవత్ శేషత్వమును, భాగవత శేషత్వము వరకు తీసుకొని వెళ్లును. ఇపుడు భాగవత శబ్దము క్రొత్తగా తీసుకొని రాబడినది దాని నిర్వచనము ఏమి? ఎట్టివారు భాగవతులగుదురు?

భగవంతునికి సంబంధించిన శేషత్వము భగవచ్ఛేషత్వమగును. భగవన్మంత్ర మగు నారాయణ మంత్రమునందు, ఆ మంత్రము ప్రతిపాదించు దైవము నారాయణుని యెడల, ఆ మంత్రము ప్రసాదించు ఆచార్యుని యందు నిష్ఠా భక్తులు పూర్ణముగా కలవారు భాగవతు లనబడుదురు. వారికి శేషపడి దాసులై యుండు స్వభావము భాగవత శేషత్వమగును. శేషత్వమనునది భగవంతుని నుండి భాగవతుల వరకు విస్తరించినపుడే అది ఉజ్జీవ కారణమగునని నమః పదము తెలుపుచున్నది. అప్పుడే అది పరిపూర్ణమగును.

వేదము తైత్తరీయము భగవద్గీత (7-18, 19) రహస్యామ్నాయ విష్ణుసంహితలు భగవచ్సేవ వలన మోక్షసిద్ధి సందేహము కావచ్చునేమో కాని, భాగవత పరిచర్య వలన నిశ్చయముగ మోక్షసిద్ధి కలుగునని చెప్పుచున్నవి. భాగవతుడైన గురువును వదలిన వానిపై నారాయణుడు ఆగ్రహించును. జలమును వదలిన కమలమును, సూర్యుడు తపింపజేయునే గాని ప్రవృద్ధి చేయడు కదా! సంసారమొక విషవృక్షమే. అయినను దాని నుండి అమృతము వంటి రెండు ఫలములు కలుగును. అందొకటి హరిభక్తి కాగా రెండవది హరిభక్తులతో సహవాసము. భగవద్భక్తులు శూద్రులైనను వారినా విధముగ పరిగణింపరాదనియును, భాగవతులైన బ్రాహ్మణులుగ నెన్నవలెననియు

మార్కండేయ పురాణము చెప్పుచున్నది. ఏ వర్గమునందైన భగవద్భక్తి హీనులే అధములగుదురు.

ఎనిమిది విధముల భక్తులు కలవారు ఛండాలురైనను వారే బ్రాహ్మణులు, వారే మునులు, వారే శ్రీమంతులు, వారే యతులు, వారే పండితులును నని భగవంతుడు సెలవిచ్చి యున్నాడు. ఆ ఎనిమిది విధములునేవి? భగవద్భక్తులందు వాత్సల్యము, భగవంతుని పూజించుటయందు ప్రీతి, భగవత్పూజ, దైవ విషయమున డాంబికము లేకయుండుట, భగవత్కథలు వినుటయందు ఆసక్తి, ఆ వినుటలో నేత్రాంగ వికాసము, సదా భగవత్ స్మరణము, భగవద్వియోగము సహింపలేకపోవుట అనునవి.

వేద పండితుడే కావచ్చును – హరిభక్తి హీనుడైనచో పూజనీయుడు కాడు. హరిభక్తి కలవాడు ఎవడైనను పూజింపదగినవాడే యగును, వాని కీయవచ్చును. వాని నుండి గ్రహించవచ్చును, వాడు భగవంతునితో సమానుడని, భగవంతుడు భాగవతుల వైభవమును గురించి చెప్పెను. అటువంటి భాగవతులకు శేషపడి యుండుట ఉజ్జీవన హేతువని 'నమః' పదము తెలుపుచున్నది.

నమః పదములో న మః అను రెండక్షరము లున్నవి. ఇది అఖండముగాను, సఖండముగాను రెండు విధములుగా నున్నది. అఖండమైనపుడు నమస్కారమను అర్థమిచ్చుచుండగా, సఖండమైనపుడు (న+మః) నా కొరకు కాదు – నమస్కారము నా కొరకు కాదు – ఇతర ఆత్మలకు కాదు అను అర్థమిచ్చును. ఆత్మకే కానప్పుడు ప్రకృతి పదార్థములకును కాదు. మరెవరికి? నారాయణుని కొరకే యని గట్టిగా తెలియుచున్నది. నేను చేయు కార్యములు నా కొరకు కావు. వానిపై నాకు మమత్వము లేదు. అవి యన్నియు నారాయణుని కొరకే. నేను, నాది యనునది విషముతో సమానమైనవి. నాది కాదు, నీవు నీది యను మాటలు అమృతము వంటివి.

'నమః యని కాని, 'నమమ' యని తలచినపుడు, అహంకార మమకారములు నాశనమైపోవును. రక్షణ భారము పరాత్పరుని యందు నిలచును. తరించుటకు ఇది సులభోపాయము. నారాయణుడు సుదర్శనమను చక్రాయుధముతో లోకముల జయించువాడు. ఆ భగవద్భక్తులు ప్రసన్నులు నైనవారు నమః అను సుదర్శనముచే లోకముల జయించువారు. కావున నీ శబ్దార్థ జ్ఞానము అపేక్షితమై యున్నది. నమస్కరించుటను అంజలి అందురు. అంజలి యన అకారముచే చెప్పబడు జగన్నాధుని నీటివలె కరగించి ద్రవీకరించునది. అంజలికే భగవంతుడు వశుడగును. ఈ విషయము భారద్వాజ సంహిత చెప్పుచున్నది. నమః శబ్దపు స్థూలార్థమేమి?

తత్వదీప గ్రంథము ఇట్లు చెప్పుచున్నది. తనకంటె జ్ఞానముచే వృద్ధులైన వారికి వినయముతో శరీరము వంచి, మనస్సులో నమః శబ్దము తలచి, వాచికముగ నమః అనుచు రెండు చేతులు జోడించి చేయు అంజలిని నమస్కార మందురు. ఇది త్రికరణములతో చేయవలసినది – పరిపూర్ణ నమస్కారమగును. ఆత్మలు సామాన్యమని, ఉత్తమమని రెండు విధములుగా నుండును. ఆ ఉత్తముడే పరమాత్మ. మిగిలినవారు సామాన్యులు. ఆ ఉత్తముని శేషియని, మిగిలినవారిని శేషభూతులని అందురు. శేషికి నమస్కరించువాడు శేషభూతుడు. శేషి యిష్టానుసారము ఉపయోగపడువాడు శేషభూతుడు. వినియోగించుకొను వాడు శేషి. అతడు నిరుపాధిక బంధువు. శేషభూతుడు ఉపాధి కలవాడు. అతనికంటె శేషి సర్వదా శ్రేష్టుడు. ఈ విలక్షణ జ్ఞానము కలిగి, శేషభూతుడు చేయు నమస్కారము – నమనము – అని శాస్త్రములు చెప్పుచున్నవి. దానిని నికృష్టులైన జీవులు లేక భక్తులు అణకువతో చేయగా, నది శేషిని లోబడునట్లు (చేయును) ప్రేరేపించును. అందుచే దానిని నమస్సు అందురు. నమః యొక్క సూక్ష్మార్థము ఏమి?

కనిపించు వస్తువులలో నావి, నావారివి అను మమత్వముండును. దానిని మమ్య మందురు. మమత యనగా నభిమానము. మమత యెందుకు కలుగును? దేహము ఇంద్రియముల అనుభవము వలన మమత కలుగును. దీని ఫలితము మిధ్యాజ్ఞానము. అది నాది, నా వారిది, నేను స్వతంత్రుడను అను భావమును కలిగించును. ఈ యజ్ఞానము – నమే – నమమ యను పరిశుద్ధ జ్ఞానము వలన తొలగిపోవును. కనుక నమ యనబడుచున్నది.

ప్రణవము నందలి అర్థస్వరూపము వలన – నేను నాకు కాదు – నేను అస్వతంత్రుడను. పంచభూాత్మికమైనది శరీరము. కర్మేంద్రియములు జ్ఞానేంద్రియములు శబ్దాదులు, అహంకార చతుష్టయము – ఇవి యేవియు నావి కావు. 24 తత్త్వములు కల పరమాత్మకే అను జ్ఞానము కలుగును. ఇట్లు సర్వము 'విష్ణుమయమే' యను సమీచీన జ్ఞానము ఈ నమస్సుచే కలుగుచున్నది. నమః యొక్క అర్థమింకేమైన కలదా?

ముఖ్యార్థ మింకొకటి కలదు. అది తత్త్వదీపము ఒకటవ ప్రకరణము చెప్పుచున్నది. నమః శబ్దము న్యాస వాచకము. న్యాస శబ్దము పరమాత్మను చెప్పును. సాక్షాత్ ఉపాయభూతుడు అతడే. 'న' ముఖ్యమార్గమును సూచించును. 'మ' ప్రాధాన్యతను నిరూపించి చెప్పును. విసర్గ (ః) భగవంతుడు పురుషోత్తముడు శక్తివంతుడు అచ్యుతుడునగు ప్రభువును తెలుపును. ఇట్లు షడ్గుణములచే పరిపూర్ణుడగు పరమాత్మ ప్రాప్తికి నమః లేక నమస్సు – ప్రధానోపాయము. ఓం నమః నమోనమః నారాయణాయ నమః. నమః పదప్రయోగమునకు ప్రాచీన సాహిత్యమున ప్రమాణము లెచట లభించును? యజుర్వేదము 1–4 లోను, భారత సభాపర్వము 66–41 యందు, భగవద్గీత 9–41 లోను, 18–65 నందు లభించుచున్నవి. ఇక నారాయణ శబ్దార్థ విచారమునకు పూనుకొనుట మంచిది.

*    *    *

నమః శబ్దార్థము తెలుసుకొని నారాయణ శబ్దార్థ మెరుగుట శ్రేష్టము. తత్త్వదీప మిట్లు చెప్పుచున్నది. 24 తత్వములతో కూడిన ప్రకృతి కంటె పరమైన 25వ వాడు పురుషుడనబడువాడు. దేవ మానవ స్థావర తిర్యక్ జంగమములకు ఆత్మయైనవాడు – నర శబ్దముచే పిలువబడుచున్నాడు. ఇతిహాస సముచ్చయ గ్రంథము చెప్పునదేమనగా – నరశబ్దముచే చెప్పబడిన వానిచే జనించినవి నారములు. నారములు ఆధారముగా కలవాడు కనుక నారాయణుడని చెప్పబడుచున్నాడు. సుబాలోపనిషత్ నారములు జీవన సమూహము అనియు నిత్యమైన జీవన సమూహమునకు వాచకమగు శబ్దము ప్రాప్యవాచకము కనుక చేతనులకు ప్రాప్యభూతుడు నారాయణుడనియు వక్కాణించుచున్నది. అంతేకాదు, తల్లి తండ్రి సోదరుడు నివాసము శరణము రక్షకము ఉపాయము నెయ్యము గతి నారాయణుడే అని చెప్పుచున్నది.

తత్వదీపము దీని నింకను వివరించుచున్నది. నర శబ్దముచే చెప్పబడు నారములనబడువారు చేతనులు. వారికి ఆధారము ఉపాయము నగుట వలన రక్షకత్వ శేషిత్వములు సిద్ధించినవాడు ఉపాయోపేయ భూతుడునై యున్నందున మునులాతనిని నారాయణుడని పిలచుచున్నారు. నారములు సర్వజీవ సమూహము. వానికి దిక్కు ఆలంబము నగుటచే నారాయణుడు స్తుతి పాత్రుడైనాడు. సర్వేశ్వరుడగు నతనిని ఏకాగ్రతతో నిత్యము ధ్యానించువానికి దానము తీర్థము తపస్సు యజ్ఞములతో నేమి పని?

నారాయణాత్మక జ్ఞానము శ్రేష్టము. అదియే యాగము, యోగము. శాస్త్రములు పరస్పర విరుద్ధమైన విషయముల (అర్థముల) జెప్పును. వాని వలన ప్రయోజనము సిద్ధింపదు. నారాయణుడే పరమ ధర్మము, పరమ తపస్సు, పరమ జ్ఞానము, సర్వశాస్త్రములు నతనినే చెప్పును. కనుక జీవులు నారాయణ పరులు కావలెను. అంతకంటె వారి ప్రార్థనల నంగీకరించువాడు కోర్కెల దీర్చు ఉదారుడు, సమర్థుడు వేరెవరును లేరు. అతడు పురుషులలో నుత్తముడు.

దేవతలకును నియంత, ఉపాసింపదగినవాడు. దేవులకు ఆదియైనవాడు. విశ్వమంతకు స్వామి. అతనిని తల్లిగాను తండ్రిగాను గ్రహించుమని స్మృతి చెప్పుచున్నది. బుద్ధిమంతుడెవరైన అతనిని అగ్ని కార్యరూపునిగా వేద స్వరూపునిగా తపోరూపునిగా పరిగ్రహించును. స్వర్గముగ మోక్షముగ అనుష్టానముగ నతనిని గ్రహించును.

నారబట్టలు ధరించినను జడలు ధరించినను దండము ధరించినను ముండిత శిరస్కుడైనను భూషణములు ధరించినను ధర్మమునకు మూలభూతము కాలేరు. పాపులు నృశంసులు నైనవారును ఆయనను ఆశ్రయించి పరమపదము పొందగలరు. నృశంసుడనగా నెట్టివాడు? తాను కోరిన విషయమునందే కాక, తనను నమ్మినవారి విషయములోను క్రూరకర్ముడైనవాడు నృశంసుడు.

విష్ణునే నమ్మినవానిని పాపములంటవు. అట్టివాడు వైష్ణవుడగును. సూర్యుని రాకతో చీకటి తొలగి పవిత్రమైనట్లు లోకములు పునీతములగును.

ఇన్ని ప్రమాణ వచనముల వలన తెలియునదేమి? నారాయణుని ఉపాయ ఉపేయత్వములు అతనితో సర్వవిధ బంధుత్వముల వలన సర్వ సమాశ్రయణీత్వము తెలియుచున్నది. మనుస్మృతి యిట్లనుచున్నది. అప అనగా నారములు. నారములను అయనముగ, ఆధారముగ కలవాడు కనుక నారాయణు డనబడుచున్నాడు. నారాయణ పదము తత్పురుష సమాసముగ చెప్పినచో 'నారములకు నివాసమైనవాడు' అగును. బహువ్రీహి సమాసముగ చెప్పినచో 'ఎవనికి నారములు నివాసస్థానమై యుండునో వాడు నారాయణుడు' అగును. 'న' కారము నిషేధ వాచకము. 'రః' రక్షించు వస్తువుల జెప్పును. 'నర' పదము క్షీణము, క్షయము లేనిదను నర్థము నిచ్చును. అణ్ అను ప్రత్యయమున అభివృద్ధియు కలసినదైనపుడు 'నారః' అని నిత్యవస్తు సమూహమును చెప్పును. నారా అని బహువచన మగుట వలన సమూహ బాహుళ్యమును తెలుపబడుచున్నది. నిత్య వస్తువు లనగానేవి?

నిత్యులు ముక్తులు ననువారు వైకుంఠనివాసులు. వారీ పదము (నిత్యవస్తు)చే చెప్పబడుచున్నారు. ఆత్మలలో వీరివి ముక్తాత్మలు. బద్ధులు (కర్మబద్ధులు) పదునాలుగు లోకములలోను ఉందురు. నారములనగా వేనిని గ్రహించవలెను?

అహిర్బుధ్న సంహిత యిట్లు చెప్పుచున్నది :

1) జ్ఞానము శక్తివంటి గుణములు
2) పర వ్యూహ విభవ అర్చావతార విగ్రహములు
3) నిత్యానపాయిని యగు లక్ష్మీదేవి
4) భూదేవి నీళాదేవి మొదలగు పత్నీ సమూహము
5) శేషుడుడు, గరుడుడు వంటి నిత్యశూరులు
6) పరమమైన పరమపదము
7) అఖండము సఖండమునగు కాలము
8) పురుష సమూహము
9) సత్వ రజ స్తమో గుణాత్మకమగు ప్రకృతి
10) మహత్తు మొదలు పృథివి వరకు కార్యవర్గము
11) ఆప అగ్నివాయు ఆకాశ భూతారులైన ఆవరణలు ఏడు
12) బ్రహ్మలోకము
13) చరాచరాత్మక భూత సహిత లోకములు
14) ఇటువంటి లెక్కలేనన్ని అండాంతర్గత పదార్థములు అన్నియు నారము లనబడుచున్నవి.

జ్ఞానాదులనగానేవి?

జ్ఞానము, ఆనందము, అమలత్వము, అనంతత్వము జ్ఞానాదులనబడును. ఏ ధర్మమునుబట్టి స్వరూపము నిరూపింపవలసి యుండునో ఆ ధర్మములివి. అందుచే వీనిని స్వరూప నిరూపక ధర్మములు అందురు. జ్ఞానము అనగా ఏ కాలమందైనను ఏ వస్తువునందైనను సాక్షాత్కరించగల సామర్థ్యగుణ విశేషము.

జీవులు ఆయా యుగములలో విషమ సృష్టియందును, వారి వారి కర్మల ననుసరించి పలు రకములుగా జన్మించి యుందురు. వారి వారి స్వరూప భేదమును గాని, పేరుల తేడాను గాని లెక్కించక గుర్తించగల శక్తిని జ్ఞానము అందురు అని ముండకోపనిషత్ చెప్పుచున్నది.

ఆనందవల్లిలో చెప్పినట్లు, సర్వేశ్వరుడు వాచామగోచరమైన ఆనందము కలవాడు. ఆనందింపజేయువాడు నతడే. ఆనందమనగా ముక్తి దశయందు ఆత్మలు అందరికి అన్నివిధముల అవయవముల కలుగజేయు విశేషగుణము – ఆనందమని తైత్తరీయము చెప్పుచున్నది. స్వయముగా ప్రకాశించువాడు, సుఖ స్వరూపుడు, దివ్యాత్మ యనబడువాడునైన భగవంతుని లక్ష్మణము ఆనందము.

మలము అనగా దోషము. మలము లేకుండుట అమలత్వము. అవిద్య కర్మ వాసనాదులు మలములు. అవి ఎనిమిదియని తైత్తరీయము చెప్పుచున్నది. ఆ ఎనిమిది దోషములు లేక విలక్షణముగా నుండువాడు నారాయణుడు – కనుక శుద్ధుడు నిర్మలుడునై యున్నాడు. తాను నిర్మలుడై యుండుటే కాదు. తనను ఆశ్రయించినవారిని కూడ దోషరహితుల జేయు గుణము అమలత్వ మనబడుచున్నది.

ఆత్మలకు దేశము కాలము వస్తువునను హద్దులు కలవు. పరమాత్మకే హద్దులును లేవు. ఎల్లప్పుడు అంతట, అన్ని విధముల ప్రవర్తించగలవాడు. అటువంటి భావవిశేషము అనంతత్వము అనబడుచున్నది. అతని దేశమునకు హద్దు లేదు, కాలమునకు పరిచ్ఛేదము లేదు, ఇంతయను పరిమాణమును లేదు. అసలతని వస్తు సంపదకు సంఖ్య లేదు. విష్ణు సహస్రనామము ఈ అనంత నామమును చెప్పుచున్నది. అమలత్వాది ధర్మములచే నారాయణుడు నిరూపింప బడినాడు. ఆ దివ్యాత్మ యొక్క ఆరు గుణ విశేషములేవి?

పరమాత్మ తన ప్రకాశముచే నన్ని పదార్థములను ఎల్లవేళల ప్రకాశింపజేసి,

అన్ని యాత్మల యనిష్టముల నేకకాలమున తెలుసుకొని నివారింపగలవాడు. ఈ బుద్ధి విశేషము జ్ఞాన గుణ మగుచున్నది.

జీవులు హేయకృత్యముల జేయువారు. నిత్యసంసారులు. అటువంటివారిని కూడ పరమపదవాసులైన నిత్యశూరులతో సమానులనుగా చేయగల అఘటిత ఘటనా శక్తి కలవాడు, అట్టి సమర్థత కలవాడు. ఆ గుణవిశేషము శక్తి యనబడుచున్నది.

అతడు విశ్వమందుండు సమస్త వస్తు సమూహమును విశ్వమును కూడ ధరించగల సామర్థ్యము కలవాడు. పదునాలుగు భువనములను వాని యందలి వస్తు సమూహముతో సహా, యశోదకు తన నోటియందు చూపెను కదా! ఈ సామర్థ్యము బల మనబడుచున్నది.

సృష్టియందలి వస్తువులు అనంతములు. వానిని ఏవి యుండవలసినట్లు వానిని నియమించును. ఈ నియమించి విభవమును ఐశ్వర్యము అందురు.

అనంత సృష్టికి వారి వారి అభీష్టములను ప్రసాదించుచు పరమాత్మ ఉపాదాన కారణమైయున్నాడు. అయినను తన స్వరూపమున కేవికారము లేకయుండు పరమాత్మ లక్షణము వీర్యమనబడుచున్నది.

పరమాత్మ యెవరి స్వాధీనమున నుండువాడు కాదు. అతని సంకల్పము ఎవరి సహకారము నపేక్షింపదు. ఈ గుణము తేజస్సు అనబడుచున్నది. ఆ సర్వేశ్వరుని యనంత కళ్యాణ గుణములలో కొన్నిటినైన స్మరించుట యుక్తము కదా!

గోవుకు అప్పుడే పుట్టిన తన దూడ యందు గల యపేక్ష గర్భవాస ప్రేమ. ఆ దూడ యొక్క శరీర మాలిన్యమును భోగ్యమున భుజించి, తియ్యని రుచికరమైన పాలనిచ్చి కాపాడునట్లు చేయును. దూడ జోలికెవరు వచ్చినను వారిని కొమ్ములతో కుమ్మి, కాళ్లతో తన్ని కాపాడునట్లు చేయును. ఇది వాత్సల్యము చేతనే. రామాయణ యుద్ధకాండలో తన వక్షమును అడ్డుగా నిలిపి లక్ష్మణుడు

విభీషణుని కాపాడినది యీ గుణము చేతనే. సర్వేశ్వరుడు జీవుల దోషములను భోజ్యములుగా – అనుకూలురను ప్రతికూలురను కూడ రక్షించుట వాత్సల్యము చేతనే. ఇది దోష భోగ్యత్వము. రామాయణ సుందరకాండలో సీతాదేవి 'ఆవు–దూడ యందు పడు పాట్లు – శరణాగతుల విషయములో రాముడు పడున'ని రావణునితో చెప్పినది. వాత్సల్యమనగా నిట్టిది.

నారాయణుడు ఉభయ విభూతులకు నాయకుడు. ఇందు 14 లోకములు ప్రకృతి మండలము – లీలావిభూతి యనబడును. త్రిపాద్విభూతి యనబడు పరమపద నాధుడతడు. ఇది నిత్యవిభూతి. వీనికి ఏకైక నాయకు డతడు. నిరంకుశుడు, స్వతంత్రుడు, సకల ఐశ్వర్య సంయుతుడు. అజ్ఞానమునకు నెలవైన వాడు, ప్రకృతి మండలమున జన్మించినవాడు నగు మానవుడు – అతని గొప్పతనము నెట్లు గుర్తింపగలడు? ఆ సంకోచముతో జీవుడాతని జేరుటకు వెనుదీయకుండ జీవులందరితో సమముగ నుండుచు, తానే చొరవ తీసుకొని ఆ కలయిక యొక్క ఫలము తనకే యనునట్లు మెలగు గుణవిశేషమును సౌశీల్యము అందురు. రాముడు తాను సర్వేశ్వరుడైయైనను మానవమాత్రునిగను వనచరులకు సహచరుడుగను కలసి మెలగినట్లు రామాయణ యుద్ధకాండ చెప్పుచున్నది. కృష్ణావతారమందు అర్జుననిచే కృష్ణ యాదవ సఖ యను ఏకవచనముల సంబోధింపబడినట్లు భారతము చెప్పుచున్నది. తనను బంధువుగా కాక వేరుగా తలచవద్దని కృష్ణుడు స్వయముగ చెప్పినట్లు భారతము వెల్లడించు చున్నది.

సొత్తు కలవాడు స్వామి. చరాచరములన్నియు నా జగన్నాధుని సొత్తు. అట్లు స్వామి సొత్తైన జీవుడు. దానిని మరచి స్వతంత్రుడనను భావముతో లోకవిషయములందు ప్రావిణ్యము కలిగి ప్రవర్తించినను నత్తగుల్ల లోని జీవిని కాపాడునట్లు రక్షించుట స్వామిత్వమనబడును. జగన్నాధుని యీ స్వామిత్వ కారణముననే తనను మరచిన చేతనుని యందు ద్వేషము లేక అభిముఖ్యములను

అజ్ఞాత సుకృతములను కలుగజేసి, వానిని దిద్దుబాటు చేయుచున్నాడు. స్వామి తన కార్యము చేయునో చేయడో యను జీవుని సంశయమును పోగొట్టి విశ్వాసము కలిగించు గుణమును స్వామిత్వమందురు.

ఒకచోటు అని కాని, ఒక సమయమందు అని కాని, ఒక జాతియందని కాని, ఒక అవస్థయందని కాని నియమములేక అందరు ఆశ్రయించుటకు సర్వేశ్వరుడు అనువైనవాడు. అతడు అతీంద్రియుడు – అనగా ఇంద్రియములైన కండ్లకు కనబడనివాడు. అయినను ఆ సంకోచ మక్కరలేక కండ్లతో చూచి ఆశ్రయించుట కనువైనది సర్వేశ్వర రూపము. దీనిని సౌలభ్యము అందురు.

ఇక అహిర్బుధ్య సంహిత పేర్కొనిన నాలుగు వాసుదేవ వ్యూహముల పరిశీలించుదము.

పరమపద మందలి వాసుదేవ వ్యూహము వీనిలో మొదటిది. దీనిని పరవాసుదేవ రూపమందురు. ఇది నిత్యులకు ముక్తులకు ముక్తాత్మలకు అనగా వైకుంఠ నివాసులకు మాత్రము దర్శనీయమైనది.

పాలసముద్రమందు శయనించి యుండు వాసుదేవ రూపమును వ్యూహ వాసుదేవ రూపమందురు. ఇదియు సాధారణ జీవులకు దర్శనీయము కాదు.

పరాత్పరుడెత్తిన మత్స్య కూర్మ రామకృష్ణాది రూపములు విభవవాసుదేవ రూపములు. ఇవి భూమండలమందు అవతరించినవే. కాని కాలాంతర సంభవము లైనందున మన చర్మచక్షువులు దర్శించుటకు అనువుకానివి. భూమిలోనికి చేరిన నీటివలె కన్నులకు కనిపించక హృదయాంతర్గతమై యుండును.

నాల్గవది అర్చావాసుదేవ వ్యూహము. ఇవి భరత ఖండమున మనస్సుచే మాత్రమేకాక మాంసచక్షువులతోను చూడబడు దివ్యమంగళ విగ్రహరూపములు. ఇవి సంపూర్ణ ప్రత్యక్ష రూపములైనందున వీనిలో సౌలభ్య గుణ విశేషమున్నది. ఈ కారణముచేతనే కృష్ణావతారమెత్తి యుండిన పరాత్పరునికి కుబ్జ రాజోచిత

చందన మాల్యములు సమర్పించి, తన యింటికి రమ్మని వస్త్రము పట్టి లాగగలిగినది.

అనంతగుణ పరిపూర్ణుడగు సర్వేశ్వరుని మరికొన్ని కళ్యాణ గుణములను దర్శింతము.

ఆయన ఆశ్రితుల యెడబాటును సహించని మానసిక వాచిక ప్రవృత్తి కలవాడు. ఈ గుణమును 'మార్ధవము' అందురు. ఆశ్రితుల విషయములో మానసిక వాచిక కాయికములను ఏకస్వరూపముగ తనను తాను నియమించు కొనును. ఈ ఋజుత్వ లక్షణము ఆర్జమనబడుచున్నది.

అతడు జీవుల అభిమతముల ననుసరించి శ్రేయస్సును కూర్చువాడు. ఉపకారమునకు తగని వారి విషయములో కూడ వారికేమి చేయవచ్చునో యని వారి శుభమును కోరియుండు గుణము కలవాడు. దీనిని 'సౌహార్దము' అందురు.

జీవుల జన్మగుణ ప్రవృత్తుల నెంచక ఆశ్రయించు అందరిని ఆదరించు సమత్వ గుణము కలవాడా జగన్నాధుడు. స్తోత్రము చేయువారి పాపములను నాశనము చేయువాడు. ఈ భావము 'సౌమ్యము' అనబడుచున్నది.

తనకేమి ప్రయోజన మని యెంచక పరుల దుఃఖములను సహించలేని సర్వేశ్వరుని గుణవిశేషము 'కారుణ్యము' అనబడుచున్నది.

పరమాత్మ 'మాధుర్య' గుణపూర్ణుడని ఛాందోగ్యము నుడువుచున్నది. నానావిధ రుచులు కలిగి నిర్దయులై యున్న జీవులకు వారు వారు నిలచియుండు స్థితులలో 'భోగ్యుడై' యుండువాడు. తనను ద్వేషించి చంపదలచి యుండువారి చిత్తముల సైతము హరించువాడు.

నారాయణుడు యిట్లు చేయును అని ఊహించుటకు అలవి కానట్లుండు గుణము 'గాంభీర్యము'. అతడు నిర్మలమైన తన దివ్యదేహమందు సర్వేశ్వరత్వము నకు తగిన గాంభీర్యము కలవాడు. అనాది నుండి అవిద్యచే దూషితుడై యుండు

జీవుడు - ఇందుప గంధముచే తేరిన జలము వలె ప్రకాశించుచుండ (భగవత్సంబంధముచే) స్వతఃప్రకాశము కల సర్వేశ్వరుడు ప్రకాశించుటలో వింత లేదు.

తీసుకొనువాని అల్పత్వమును లెక్కచేయక, ఇవ్వబడు వస్తు గౌరవము చూడక నిరపేక్షతో జీవులకు వితరణ చేయు సర్వేశ్వరుని రసికతను “ఔదార్యము” అందురు.

నిరంతరము తనను ఎడబాయక యుండి పురుషకారము చేయుచుండు లక్ష్మీదేవి కూడ తెలుసుకొనలేనట్లు ఆశ్రితులు సందేహపడుచున్నను, దానిని పారద్రోలి రక్షించు సర్వేశ్వరుని గుణవిశేషము ‘చాతుర్య’ మనబడుచున్నది.

ఎన్నెన్నో అపచారములు చేసియు తనను ఆశ్రయించు చేతనుల అపచారములకు వెనుదీయక స్థిరుడై యుండు పరమాత్మ గుణమును ‘స్థైర్యము’ అందురు. దోషులనైనను రక్షించవలెనను దృఢభావమిది. దీనిని దోషభోగత్వమని యితఃపూర్వము చెప్పబడినది.

ప్రతికక్షులు తనపైకి దండెత్తి వచ్చినను, తన ప్రతిజ్ఞా భంగము కాకుండ, తన యింటియందువలె వారిలో ప్రవేశించు జగన్నాథుని సామర్థ్యమును ‘ధైర్యము’ ‘శౌర్యము’ నందురు.

పై విధముగ ప్రవేశించి శత్రుబలమును సమూలముగ నిర్మూలించు భగవంతుని దక్షత ‘పరాక్రమము’ అనబడుచున్నది.

కామములనగా కళ్యాణ గుణములు, విభూతులు. ఆశ్రితులు అనుభవ పూర్వకముగ తెలుసుకొనునవి. సర్వేశ్వరుని విభూతులు సత్యమైనవి మాత్రమే కాదు, నిత్యమైనవి కూడ. అట్లు ఆశ్రితుల విషయమైన నారాయణుని మనోరథమును “సత్యకామత్వము” అందురు.

మనుష్యాది అనేక రూపములు ధరించి, ఎన్నో భోగ్యాంతరముల సృష్టించి

యున్నను జగద్వ్యాపారమునందు మోక్షమిచుట యందు తిరుగులేని సంకల్పము కలిగియుండుట జగన్నాధుని లక్షణము. ఆశ్రితులకు అట్లు దర్శనమిచ్చుటకైన యతని అప్రతిహత సంకల్పము 'సత్య సంకల్ప' మనబడుచున్నది.

అతడెవనిని సద్గతి నందింప జూచునో, వారిచే సత్కార్యముల జేయించును. తనకు దూరమైన చేతనులు తిరిగి తనను చేరినచో అది వారికే లాభము. దానిని తన లాభముగ తలచు భగవంతుని గుణమును 'కృతిత్వము' అందురు.

ఒకమారు తనకు నమస్కరించిన మాత్రమున వానిని, వానివారిని కూడ రక్షించుట పరమాత్మ గుణము. వాడు చేసిన సత్కర్మ అల్పమైనదే కావచ్చును. దానిని కూడ గుర్తించువాడు సర్వేశ్వరుడు. తాను వారికి చేసిన బహు విధోపకారములుగాని, ఆశ్రితులు చేసిన దోషములుగాని గుర్తించని భగవంఉని గుణవిశేషము 'కృతజ్ఞత'.

ఇంతవరకు సర్వేశ్వరుని జ్ఞానానందాదులు మొదలు భగవత్ స్వరూపమును నిరూపించు ధర్మములు, ఆతని స్వరూప విశేషములైన కళ్యాణ గుణములు నిరూపింపబడినవి. ఇక ఆ కళ్యాణముల ప్రకాశక నిలయమైన దివ్యమంగళ విగ్రహము, దాని గుణములైన సౌందర్యాదుల గురించి తెలుసుకొనుట యుక్తము.

పరంధాముని 'దివ్యమంగళ విగ్రహము' అను పదము – ఆతడు ఇచ్ఛాధీనముగ పరిగ్రహించు ఇతర విగ్రహములను కూడ తెలుపును.

వానిలో 'కాంతి' లేక 'వెలుగు' లేక 'ప్రకాశము' మొదటిది. అవయవశోభ తరువాతది. దీనిని 'సౌందర్యము' అందురు. పుష్పహాసము వంటి మృదుత్వము – అనగా 'సౌకుమార్యము' ఆ తరువాత వచ్చునది. సమస్త వస్తువులను పరిమళింపజేయు గుణము 'సౌగంధ్య'మూ పిమ్మట వచ్చును. నిత్యముగా నుండు యువకత్వము, అనగా 'యౌవనము' ఐదవది.

ఇక ఆ దివ్యమంగళ విగ్రహమునందు పుష్పించినట్లుండు దివ్యాభరణములను తెలుసుకొందము. ఉభయ విభూతి నాయకుడగు భగవంతుడు చక్రవర్తిత్వ సూచకముగ ధరించు శిరోభూషణము – కిరీటము. దీనిని మకుటమనియు నందురు. దానిపై పొదగబడి ప్రకాశించు రత్నము చూడము అనబడుచున్నది. వాయువుచే కదలింపబడుచు మెరయుచుండునది నెమ్మిపించము. సిగబంతిగ ధరించునది అవతంసము. మొసలి ముఖములు కలిగిన పురుష కర్ణభూషలు మకర కుండలములు. కంఠమున ధరించు రత్నహారము గ్రైవేయకము. బాహువుల కలంకరించు బాహువలయములు భుజకీర్తులు నైనవి కేయూరములు. చేతులకు ధరించు సింహపుతలలు కల ఆభరణములు కటకములు. మహాపురుష లక్షణమై వక్షస్థలమున మెరయుచునుండునది 'శ్రీవత్సము' అను పుట్టుమచ్చ. ఇందు వక్షమున ధరింపబడినది 'కౌస్తుభ'మను అపూర్వమణి. కంఠమున హారములకు తోడుగా ధరించునవి ముత్యాల సరములు, తులసీ దామములు, ఉదరమున ధరించు బంగరు పట్టె మొలత్రాడు, నడుమున కట్టిన పచ్చని పట్టువస్త్రము, 'కాంచీగుణము' అను మొలనూలు పట్టె, పాదములకు ధరించు ఆభరణములు – ఇవి యన్నియు నారాయణుని దివ్యమంగళ విగ్రహమున ధరింపబడుటచే శోభస్కరములగుచున్నవి. ఇవికాక ఆభరణములని భ్రమపడునట్లు ఆయుధములున్నవి.

బలము శక్తి పరాక్రమాది గుణములు కల సర్వశక్తివంతుడగు పరంధామునికి ఆయుధములతో పని యేమున్నది? అవి సౌందర్య పోషకములు, ప్రాణములు రక్షించుకొనుటకు కాక, తనను ఆశ్రయించినవారి విరోధి నిరసనము నకై స్వామిని చేరినవైయున్నవి. విశేషమేమనగా అందొక్కదానికి అన్ని ఆయుధముల శక్తి, కార్యదక్షత చేరియుండి, భగవంతుని యిచ్ఛననుసరించి ప్రయోగింపకయే పనులను చక్కబెట్టగలిగి యుండుట.

అందు పాంచజన్యమను శంఖము దుష్టజన హృదయములను బ్రద్దలు చేయునది. సుదర్శనమై లోకములను పీడించువారి కంఠముల నుత్తరించునది చక్రము. శత్రుసంహారముచే భూమికి మోదమును ఆశ్రితులకు హార్ద్రమును కలిగించు కౌమోదకి యను పేరు గల గద. నారాయణుని అతని మిత్రులను సంతోషపరచునది నందక నామము కల ఖడ్గము. నారి మ్రోత ఓంకారనాదము చేయుచుండ, శత్రునాశనము చేయు శార్ఙ్గము అను విల్లు. ఈ ఐదును పంచ మహాయుధములు అను పేరుతో పిలువబడు స్వయంచోదక ఆయుధములు.

ఆ పరాత్పరుడు చేత అరవిందము ధరించువాడు. అది సృష్టికారకమై యున్నది. సుదర్శనము సర్వచేతన పాలన సామర్థ్య చిహ్నము, గద సంహార శక్తికి కారణము, శంఖము ముక్తి ప్రదాతృత్వ చిహ్నమునై యున్నవి. పంచ ఆయుధములు పంచభూతముల యొక్క శక్తి స్వరూపములని వ్యాసమునీంద్రుడు స్పష్టపరచి యున్నాడు.

ఇంతవరకు చెప్పిన అన్నిటిని సమీపమున నుండి అనుభవించుచుండువారు, దివ్య మహిషీవర్గము. అందు శ్రీదేవి నారాయణుని వక్షస్థలమునందుండి, అతని శాంతి సంరక్షకురాలైయున్నది. ఆశ్రిత రక్షణమందు పురుషకారము చేయునదై యున్నది. భూనీళాదిపత్ని వర్గముతో కలసి భగవంతుని ఆనందపరచునదై యున్నది. ఈ విషయము శ్రీ గుణరత్నకోశము చెప్పుచున్నది.

శ్రీ శ్రియఃపతులు కలసియుండునపుడా దివ్య దంపతులకు సేవ చేయుచు నుండువారు సూరివర్గము. వారిలో అనంతుడు – ఆదిశేషు డనబడుచు దేశ కాల వస్తువులచే అవధిలేక యుండువాడు – అనగా ఎల్లప్పుడు అంతట సకల విధముల ప్రవర్తించుచు పాన్పుగ నుండి పరిచరించువాడు. సర్వేశ్వరుడు రక్షించుటలో లెక్కించలేనన్ని గుణసంయుతుడైనట్లు ఆదిశేషుడు సేవించు విషయములో లెక్కలేనన్ని (అనంత) గుణములు కలిగి అనంతుడగుచున్నాడు. రెక్కలచే నాకాశమార్గమున నెగసెడువాడు. సర్పములను భక్షించువాడు.

భగవంతుని సర్వేశ్వరత్వ చిహ్నముగ నతని ధ్వజమందు చిహ్నమై యుండువాడు గరుడుడు. అతడు సర్వేశ్వరునికి కింకరుడు స్నేహితుడు వాహనము ఆసనము ధ్వజము గొడుగు చామరమునై యున్నాడు. నలుదిక్కుల రక్ష్యవర్గము కలిగి యుండువాడు విష్వక్సేనుడు. ఇది సామర్థ్యమును శరీరశక్తిని తెలుపు పదమై యున్నది. ఇతడు ప్రధానమంత్రిగ సేవించుచు సర్వేశ్వరునిచే విడువబడిన ప్రసాదముచే దేహధారణ చేయువాడు. స్వామిచే సమర్థునిగ గుర్తింపు పొందినవాడు. ఇతడేది విన్నవించినను సర్వేశ్వరుడు దానిని అంగీకరించునట. ఇంతటి ఉత్కృష్టను ప్రసాదించినది విష్వక్సేనుని పరిచర్య.

ఇక యీ సూరివర్గము చేయు సేవలకు ఉపకరణములైన వాని విచారణ చేయుదము. అవి ఛత్రము, చామరము, దాళవృంతము (విసనకఱ్ఱ), బంగారు పానపాత్ర, పక్షుల నిలయము వంటివి.

పరమపదము నందు దివ్యగోపుర ద్వారపాలకులు – తూర్పువైపున చండ ప్రచండులు, దక్షిణమున భద్ర సుభద్రులు, పడమట జయ విజయులు, ఉత్తరమున ధాత్ర విధాత్రలు.

వీరుగాక దేవసేనా నాయకులు – వీరు దేవసేనలను నడిపించుచుందురు. వీరిలో ప్రముఖులు – కుముదుడు, కుముదాక్షుడు, పుండరీకుడు, వామనుడు, శంకుకర్ణుడు, సర్వనేత్రుడు, సుముఖుడు, సుప్రతిష్టుడు ననువారు.

వైకుంఠ నివాసులగు ముక్తపురుషుల గురించి ప్రారంభముననే ప్రస్తావించ బడినది. వీరు నిత్యసూరులతో సమానాకారులై నిఖిల కైంకర్య నిరతులుగా నుండునట్టి అసంఖ్యాకులైన మునివరులు.

పరమపదము పరమేష్ఠి పుమాన్ విశ్వము నివృత్తము సర్వముననునవి పంచోపనిషత్తు లనబడును. ఇవి ఉపనిషణ్మయమగుటచే సమూహాత్మకనలై యుండునవి.

ఇంతవరకు 14 రకముల నారములు చెప్పబడినవి. ఇవి నారాయణుని నిత్య విభూతియగు వైకుంఠమునకు చెందినవి. ఇక లీలా విభూతియను పదు

నాలుగు లోకములందలి నారముల గురించి సంక్షిప్తముగ తెలుసుకొందము.

వీనిలో మొదటిది ప్రకృతి. దీనితో సృష్టి ప్రారంభమగునని, పురుష భోగము కొరకైన శబ్ద స్పర్శాది భోగ్య వస్తువులను చేయునదియని, సత్వరజస్ తమోగుణములని అమరకోశము – ప్రకృతి గురించి చెప్పినది. ఇది ఉపాదాన కారణమని, పదార్థములను ప్రకృష్టముగ చేయునదియనియు చెప్పినది. జ్ఞాన శూన్యమైనది, వికారములకు నెలవైనది. వీనిలో శుద్ధసత్వము – రజస్తమోగుణ స్పర్వలేక కేవలము సత్యమై భగవంతుని సంకల్పముచేత విమాన మంటపాది రూపములు పొందుటకు తగియుండును. పరిచ్ఛేదించుటకు అశక్యమైయుండు నది యని మాండూక్యము చెప్పుచున్నది. త్రిగుణములతో కూడియుండునది – మిశ్రసత్వము. జ్ఞాన ఆనందములకు తెరయై యుండునది – వికారము కలిగించునది. సర్వేశ్వరుని క్రీడాపరికరముగ శరీరభూతమై యుండునది సత్వశూన్యము. ప్రకృతి – అవిద్యయని, మాయయని పిలువబడుచు విచిత్ర సృష్టికారకమైయున్నది.

లీలావిభూతియందు రెండవ నారములు బద్ధాత్మలు. సాంఖ్యము దీనిని ఇరువది యైదవదిగా చెప్పినది. మైనములో వత్తులవలె ప్రకృతిలో నివి చిక్కుకొని యుండును. స్వరూపము నశించి దేవ, మానవ, తిర్యక్, స్థావరములనబడు చుండు జీవులు.

ఆ పిమ్మటిది కాలము. ఇది అఖండము సఖండముగా నుండును. అందు అఖండమైనది పరమపదమున నుండగా రెండవది యగు సఖండము లీలా విభూతితో నుండునది. ఇదియును అచిత్ విశేషమే. విఘడియ నుండి సంవత్సర పర్యంతమైనది.

ఇవికాక పుట్టుక నాశనము కలుగుచున్నను – సృష్టికాలమందున్న పేర్లు రూపములు చిహ్నములు మొదలగునవి పూర్వమువలెనె యుండుచు నిత్యములగు నారములు – సూర్యుడు, చంద్రుడు, ధాత యనునవి కలవు.

మహదాది వికారములు – మహత్తత్వముతో ప్రారంభమై పృథివి వరకు 23 తత్వములివి. మహత్తు నుండి అహంకారము, దాని నుండి జ్ఞాన కర్మేంద్రియములు, మనస్సు, తన్మాత్రలు పుట్టుచున్నవి.

మహదాది తత్త్వములచేత ఏర్పరచబడినవి అసంఖ్యేయమైన అండ విశేషములు. మట్టి ఇసుక నీరు కలిపి ఇంటిగోడను కట్టువాని వలె సర్వేశ్వరుడు పంచభూతాది తత్వముల నన్నిటిని చేర్చి ఒక అండముగ జేసి దానిలో చతుర్ముఖ బ్రహ్మను సృష్టించి అనుగ్రహించును. ఇచట సహకారి కారణము నిమిత్త కారణము నతడే. అండములలోని వస్తువులకును జీవులకును తానే అంతర్యామియై నిలచి యుండును. ఇవి సర్వేశ్వరునికి ఆటబంతుల వంటివి. నీటిబుగ్గల వలె ఏకకాలమున సృష్టింపబడుచున్నవి.

ఈ విధముగ ప్రకృతి బద్ధాత్మలు కాలము మహదాది వికారములు అండములు వానిలోని దేవ మానవ తిర్యక్ స్థావరములనబడున వన్నియు లీలావిభూతి యందలి నారములు. అధయన శబ్దములో న కారమే కాని ణ కారము లేదు కదా! నారాయణ పదములో ణ ఎట్లు వచ్చినది? నారాయణ యనునది తత్పురుష బహువ్రీహి సమాసములలో నేదైనను 'రుషాభ్యాం నోణస్సమాన పధే' మొదలగు వ్యాకరణ శాస్త్ర మర్యాదల ననుసరించి న కారమునకు ణ కారము వచ్చుట సమర్థనీయమే. న యైనను ణ యైనను అర్థభేదము మాత్రము లేదు.

నారములకు ఆశ్రయమైనవాడు – అనుచు భగవంతుని స్వరూపతః నిత్యమైన దివ్య కళ్యాణ గుణముల జెప్పినప్పటికిని, ఈ నారములను ఆశ్రయముగా కలవాడు అను తావున మాత్రము కళ్యాణ గుణములను విడచియే చెప్పవలెను.

పరబ్రహ్మ యని చెప్పబడు నారాయణుడు, ఆతని పట్టమహిషియైన శక్తి శబ్ద వాద్యురాలైన లక్ష్మీదేవియు వ్యాపకులు. నారములను సర్వపదార్థములందు

వ్యాపించు సహజ స్వభావము కలవారు. పరస్పరము నతి సంశ్లేషము వలన ఏకతత్వమువలెనే చెప్పబడుదురు. అనగా నారాయణుడు లక్ష్మీవిశిష్టుడైయే నారములందు ప్రవేశించి యుండును. చివరగా అయ పదము యొక్క అర్థము పునర్విచారము చేసిననే నారాయణ మంత్రార్థ వైభవము చెప్పుటయందు సార్థకత లభించును.

అయ అనగా కొరకు; కై. ఎవరి కొరకు? ఎవరికై? నారాయణుని కొరకు, నారాయణునికై యని యర్థము. ఈ చతుర్థీ విభక్తిచేత - యీ చేతనుడు (ఆత్మ) నారాయణుని కొరకు - నారాయణుని కొరకు చేయు సేవ - సర్వేశ్వరుని ముఖోల్లాసము కొరకు చేయవలసిన కైంకర్యము ప్రార్థించబడుచున్నది. అష్ట శ్లోకియు, ఆళ్వందార్ స్తోత్రమును - యీ అర్థమునే ప్రతిపాదించుచున్నవి.

నారాయణ మంత్రమును మంత్రార్థమును అర్హులైన ముముక్షువులకే ఉపదేశించవలయునని, రామానుజయతికి గురువగు తిరుక్కొట్యూరు నంబి ఆదేశము. దానిని పాటించి యతిరాజు ద్వయమంత్రమును విరివిగ ఆశ్రితుల కొసగుచు, నారాయణ మంత్ర మంత్రార్థములను, అధికారులైన వారికి మాత్రమే యిచ్చుచుండినట్లు భాష్యకారుల చరిత్ర ద్వారా తెలియుచున్నది.



# ద్వయమంత్ర వైభవము

వైష్ణవులైన వారి కందరకు నత్యంత ప్రీతిపాత్రములు, చేతనుల నుద్ధరించు నవియునైన మంత్రములు రెండు. అందొకటి ప్రణవముతో నారంభమై ఎనిమిది యక్షరములు కలిగియున్నందున 'అష్టాక్షరి' యనియు; మంత్రశ్రేష్ఠమై యున్నందున 'తిరుమంత్ర' మనియు పేర్లు కలిగియున్నది. రెండవది సర్వజన తారకమై 'ద్వయ' మంత్రమనియు, మంత్రములలో మేలైనదైనందున 'మంత్రరత్న' మనియు పిలువబడుచున్నది.

కంచిలో విద్యాభ్యాసము చేయుచుండిన లక్ష్మణాచార్యునికి – కంచి దైవము వరదరాజస్వామి – శ్రీరంగమందున్న మహాపూర్ణుని ఆచార్యునిగా నిర్దేశించెను. దేశికు నన్వేషించుచు శిష్యుడు వెళ్లవలెను గదా! లక్ష్మణులు శ్రీరంగము బయలుదేరిరి. ఆ సమయమందే శ్రీరంగమందున్న యామునాచార్యులు కంచి నుండి లక్ష్మణులను తన యొద్దకు తోడి తెమ్మని తన శిష్యుడు మహాపూర్ణుని ప్రేరేపించిరి. మహాపూర్ణులు కంచికి బయలుదేరిరి. కాబోవు గురుశిష్యులు మార్గమధ్యమున మధురాంతకమున కలుసుకొనిరి. అచట గల ఎఱికొత్తిరామన్ సన్నిధిలో మహాపూర్ణులు లక్ష్మణులకు పంచ సంస్కారములు చేసి ద్వయ మంత్ర ముపదేశించిరి.

కాని లక్ష్మణులకు తిరుమంత్ర ప్రాప్తి కాలేదు. మరికొంత కాలమునకు మనసున వైరాగ్య భావము దృఢతరమై – భార్యాపరిత్యాగము చేసి – నివృత్తి మార్గమవలంబింప దలచి వరదరాజస్వామినే ఆచార్యదైవముగా సంభావించి,

సన్న్యసించి – త్రిదండమును కాషాయమును ధరించిరి. ఆ సమయమున భక్తజన వరదుడగు వరదరాజస్వామి – రామానుజుడను ఆశ్రమనామము ధరించిన లక్ష్మణులకు – మంత్రరాజమగు 'అష్టాక్షరి'ని ప్రసాదించెను. నాటి నుండి జ్ఞానులై లోకవ్యవహారములందు విరక్తి, భగవద్విషయానురక్తి గల వారి నుద్ధరించునది 'అష్టాక్షరి' యను విశ్వాసము వైష్ణవలోకమున ప్రబలినది.

రామానుజయతి కొంతకాలము తిరుక్కొట్టియూర్ నంబి కడ శిష్యుడై యుండెను. అప్పుడాయతి, గురువర్యుని యాదేశము మేరకు అష్టాక్షరిని చరమ శ్లోకమును దాని తాత్పర్యమును అర్హులైన వారికి విచక్షణతో నిత్తుననియు ద్వయమంత్రమును మాత్రము విరివిగ వైష్ణవులకిత్తుననియు మాట యిచ్చిరి. జీవిత కాలము పాటించిరి.

ఆనాటి మరియొక సంప్రదాయ మింకను కొనసాగుచున్నది. రామానుజ యతిచంద్రులు ద్వయమంత్రమును తనకు వారివారిపై కల ప్రీతిచిహ్నముగ మరల మరల నిచ్చెడివారు. అంతేకాదు, వేరొకరిచే ద్వయమంత్ర ముపదేశము పొందియున్నవారికి కూడ, తామామంత్రమును మరల ననుగ్రహించినట్లు వైష్ణవ సాహిత్యము తెలుపుచున్నది. అట్లా మంత్రప్రాప్తి తమయదృష్టమని వారు భావించినట్లు తెలియుచున్నది. పూర్వాచారములను, సంప్రదాయములను పాటించు శ్రీవైష్ణవ కుటుంబములలో ఆచార్యుడు తిరు ద్వయమంత్రములను కలిపి యొక్కమారే శిష్యుని కుపదేశించు పద్ధతి కలదు.

పై విషయములను సూక్ష్మముగ పరిశీలించగా, ద్వయమంత్రమున కంటె, తిరుమంత్రము శ్రేష్ఠతర మను భావన యేర్పడు ప్రమాదము కలదు. మేఘమెంత దట్టముగ నలముకొనినను వర్షమన్ని చోటుల కురియదు. వర్షమసలే పడనిచోటు ఎడారి కదా! ఎడారిలో వాన కురిపించినచో మేఘము పొందు తృప్తి కీర్తి

ఎప్పుడును వానలు పడుచోటున కురియించినచో పొందజాలదు. అజ్ఞానులను, తక్కువ జ్ఞానము కలవారిని సామాన్యులను ఉద్ధరించు ద్వయమంత్ర వైభవము, జ్ఞానదీపము కలవారి నుద్ధరించు తిరుమంత్ర వైభవమునకు తక్కువ కాదు.

విజ్ఞులైన వారందరు మంత్రరత్నముగా పేర్కొను ద్వయమంత్రమును విష్ణు లోకమగు వైకుంఠములో నారాయణుడు మొదట లక్ష్మీదేవి కనుగ్రహించెను. స్వామి కత్యంత ప్రియమైన యీ మంత్రము నత్యంత ప్రియతరమగు కమలాలయ కనుగ్రహించుటలోని యౌచిత్య మూహింపదగినది. ఈ ద్వయతత్త్వమును తామరసాలయ యగు లక్ష్మీదేవి నాశ్రయించి చేతనులైన వారెల్లరు నెఱుగదగునను అంతరార్థము స్ఫురించుటలేదా?

ఈ మంత్రతత్త్వము కఠవల్లియందు విశదీకరింపబడినది. పద్మపురాణమీ మంత్రతత్త్వమును ప్రతిపాదించుచున్నది. ఆర్షవాఙ్మయమం దంతట శతధా పరిష్కృతమైయున్న యీ మంత్రరాజమును స్మరించుటకు మానవు లందరకు నేవిచక్షణయు లేని యధికారము కలదు; యోగ్యతాయోగ్యతల ప్రసక్తి లేదు. స్మరించిన వారెవరైనను కృతార్థులగుట తథ్యము. శ్రుతులు, శ్రుతిశిరస్సులైన ఉపనిషత్తులు నీ సత్యమును వక్కాణించియున్నది.

ద్వయమంత్ర మారు పదములు కలది పలు అర్థములు కలది. రెండు భాగములుగా చీలి ద్వయమనబడుచున్నది. దీని వాక్యముల సారమెరిగి కంటకితకాయము కల మానవుడు నిత్యము దీన సారమును గుటకలు వేసి సుకృతాత్ముడగును. విశిష్టాద్వైతము ప్రతిపాదించు – శేషత, పారతంత్ర్యత – యను రెండును చేతను లందరికి నీ మంత్రప్రభావమున ప్రాప్తించుచున్నవి. తత్పురుషార్థ లాభము కలుగుచున్నది. ద్వయమున ప్రధమ వాచ్యురాలైన శ్రీదేవిచే నే జీవుడనుగ్రహింపబడునో – వాడు శ్రీహరి యాదరణకును పాత్రుడగునని ప్రథమాక్షరమభయ మొసగుచున్నది.

జననము మరణము జీవకోటికి దాటరానివై యున్నవి. ఇవి వారిని ముంచివేయు నగాధ సముద్రములు. వేరుగా కనబడుచున్నను అనుత్తరణీయమైన ఒక సముద్రమే. దీనిలో మునిగిపోకుండ దాటి మోక్షప్రాప్తి నందుటకు జ్ఞానము గాని కర్మముగాని తపస్సుగాని తోడ్పడుననుట కల్ల. అకించనుడైన మానవునికి – ద్వయానుసంధానమను నావ యొకటియే తరుణోపాయము.

ద్వయమంత్ర ప్రాధాన్యమింకొకటి కలదు. ఈ మంత్రము, దేహమూలము నందు ఫలమును కర్మయందు చిద్వారఫలము కలుగుననెడి వైఖరిని తెలుపు చున్నది. తత్ఫలము మూలమందు మాధవునిచే కలుగుచుండ, చరమమందు కలుగు ఫలమునకు హరిప్రియయే కారణభూతురాలగుచున్నది. కావున ద్వయ మంత్ర ఫలప్రదాత యామెయే యగుచున్నది. వగరు, కాఠిన్యము, పసరు వంటి యవాంఛిత రుచులు కలుగు పిందె, చెట్టు యొక్క పత్రముల మాటున దాగుచున్నది. జీవుడో? చెప్పరాని దోషము లపారముగా నొనరించియుండియు లోకమాతయగు సాగరపుత్రిని ముందుగా భజించి, లోకపితయగు నారాయణుని దండన నుండి రక్షింపబడుచున్నాడు.

చేతనులపై జాలి వహించి వారిని రక్షించుటలో నిందిరాదేవి పురుషకారము సాటిలేనిది. జీవులు స్వాతంత్ర్యము వహించి, శ్రుతి స్మృతుల విధి నిషేధములు లక్ష్యము చేయక దోషాచరణులగుచున్నారు. జగత్పిత వారి నెప్పుడెట్లు దండించునో యని లక్ష్మీదేవి – తన పతియగు పరాత్పరు నొక చేతను, వీరు నావారు, నాకు చెందినవారు, వీరిని దయ దలచుమని పలుకుచు – బద్ధచేతనుల నింకొక చేతను విడువక పట్టియుండును. జీవులపై నింతటి దయా దాక్షిణ్యములు వాత్సల్యము నారాయణునికి కలవా? యనిపించును.

ద్వయమంత్రాధికారము సర్వులకు కలదని శ్రుతి స్మృతులు చెప్పుచున్నను,

ఆగమ శాస్త్రాదులు కొన్ని ప్రాథమికాచరణలను విధించుచున్నవి. మంత్రాధికారము వైష్ణవునికి కలిగియున్నను – వైష్ణవుడనగా నెట్టివాడు? వైష్ణవత్వ సిద్ధి యెట్లు కలుగును? అనునవి తెలుసుకొనవలసి యున్నది. జీవులకు తల్లిదండ్రు లాత్మబంధువులు. ధన ధాన్య గోగృహాదులు బాహ్య పదార్థములు. వీటిపై యభిలాష సవాసనగా త్యజింపవలెను. విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకులైన రామానుజ యతియే తప్ప వేరెవరును రక్షకుడు లేడని భావన చేయవలెను. లోకరక్షకుడగు శ్రీమన్నారాయణు డేకారణము లేకయే చేతనులపై కృప జూపు వాడనియు శరణు పొందదగు ఏకైక దైవమనియు దృఢముగా నిశ్చయించుకొని యుండవలెను. అట్టివారు వైష్ణవులనదగి యున్నారు.

పైవిధ విశ్వాసములు మనసున నిలుపుకొని యుండుట వైష్ణవ ధర్మము. ఈ ఫలప్రాప్తికి ఉపాయముగాను ఉపేయముగాను స్వామినే స్వీకరించియుండుట ముఖ్యము. అది తరించు మార్గమై యున్నది. వైష్ణవులు వైకుంఠము జేరి పరమ పదాధినాథుడగు శ్రీయఃపతి సేవ చేసుకొనుచుండవలె నని త్వరపడుచుందురు. అందుకై భూమిపై పరాత్పర నివాసములుగా నేర్పడియున్న చోటులందు నివాసము చేయుటకై విరతి జెందుచుందురు. ఆ యభినివేశము చాలును. గంగా స్నానముపై మక్కువ, కాంచీవరదుని చూచు కోర్కె, రంగనాథునికి మ్రొక్కు నిచ్ఛ, శరీరపాతము కాకముందే గదాధరుని దర్శించు వాంఛ, బదరీనాథ సందర్శనముపై నార్తి కలిగి యుండుట చాలును. ఆ తావులకు పోలేకున్నను, నివసింపకున్నను, నిరంతరము వాని చింతన ధన్యతను ప్రసాదించును.

ఇవి కాకున్నను మహత్తరమైన హరిలీలానుభూతి పొందుచు కాలము గడపుటయో; అవిశ్రాంతముగా భగవన్నామ సంకీర్తన చేయుటయో; హరిప్రియ మగు తులసీవనము పెంచి పోషించుటయో; మాధవ సన్నిధానమందు దివ్వె

నుంచుటయో; భక్తిశ్రద్ధలతో నాచరించవచ్చును. ఇందుకును శక్తి చాలనిచో నేమి చేయవచ్చు? పై జెప్పిన నే లక్ష్మణమైనను గలిగిన వైష్ణవు డెవడుగాని కంటబడినచో ‘అయ్యో! నేనీమాత్రమైన జేయలేకున్నానే! ఇతడు చేయుచున్నాడే’ యని నసూయజెందక – అతడు చేయుచున్నదానికి సంతసింపవలెను. ఈ మాత్రమునకును మనోబుద్ధులు వశపడవేని, ద్వయమంత్ర రత్నమును స్మరించుచు నూరకుండుట యుక్తము.

వైష్ణవుడగు వాని కవశ్యకర్తవ్య మింకొకటి కలదు. అది ఆచార్యుని యందును, ఈశ్వరుని యందును భక్తిభావము కలిగియుండుట. కేవలము విద్యల బోధించువాడు గురువు కాగలడేమో కాని, ఆచార్యుడు కాలేడు. ఆచార్యుడు శిష్యునికి, విద్యాసారమును తానాచరించి మార్గదర్శనము జేయును. కనుక ఆచార్యత్వము కష్టము. అతడు శిష్యుని స్వామిపాదముల జేర్చువాడై యుండును. అట్టి ఆచార్యుని యందును దైవమందును నిరంతరము విశ్వాస ముంచవలెను. ఆచార్యుని దైవ ప్రతినిధిగా సంభావించవలెను. మానవుని సన్మార్గగామిని జేయుశక్తి సహవాసమందున్నందున, జ్ఞానులు శాంతులు నైనవారి సావాసమును వైష్ణవున కావశ్యకమే.

ఇట్టి లక్షణములు కలిగి వైష్ణవుడు శోభించును. అతడు మంత్రరత్నమగు ద్వయమును ధరింపనర్హుడు. మంత్ర ప్రథమ పాదముననే శ్రీ శబ్దము చెప్పబడి నందున, పద్మాలయయైన లక్ష్మీపురుషకార మావశ్యకమని తేలుచున్నది. శ్రీ శబ్ద తాత్పర్యము రెండు విధముల జెప్పబడుచున్నది. అందు మొదటిది సర్వచేతనులు నామె నాశ్రయింతురనియు, ఆమె నారాయణు నాశ్రయించి యుండుననునది రెండవది.

మానవులు కర్మవశులై తత్ఫలితముగా దోషాళువు లగుచున్నారు. స్వామి

వారిని సృజించియున్నాడు. వారు మంచి చెడు లెరిగి వర్తింపవలెనని మనో బుధ్యాదుల నిచ్చియున్నాడు. అయినను వారు దోషములు జేయుచున్నందున తనను గుర్తింపనందున, వారిచేత శ్రుతుల నుంచినాడు. ఉపయోగింపనందున వేదాంతములైన ఉపనిషత్తుల జెప్పించెను. వారు సన్మార్గులు కానందున శాస్త్రముల విధింపజేసెను. ఫలము శూన్యము కాగా పురాణములను ఇతిహాసము లను చెప్పించెను. కార్యము చక్కబడనందున – నెట్లు నడచుకొనవలెనో ఆచరించి చూపు భాగవతోత్తములను, ఆచార్య పురుషులను పంపియున్నాడు. కాని మానవులు పరాత్పరుని అపారకరుణను గుర్తింపనందున విసిగి వేసారిన స్వామి, దండించియైన వారిని సరిచేయ దలచియుండగా, 'ఆగుడాగు'డని సాగరపుత్రి యడ్డు నిలచి, స్వామిని శాంతింప జేయుచున్నది. సర్వశుభగుణ పూర్ణపురుషుడగు స్వామి హృదయమున వ్రాలనున్న దండనోద్దేశమును శాంతింపజేసి, స్వామిని మరల పూర్ణపురుషుని జేయుచున్నది. కావుననే లక్ష్మీదేవి పురుషకారిణి యగుచున్నది. ఆమె సాహాయమే పురుషకారమని పేర్కొనబడుచున్నది.

మానవులెంతలేసి దోషముల జేసియున్నను శ్రీదేవి పురుషకార బలముచేతనే శ్రియఃపతి వారిని రక్షించుచున్నాడను సత్యమును వెల్లడి చేయుచు ద్వయమంత్ర ప్రారంభమందు శ్రీపద ముంచుటలో నామె యోగ్యత పురుషకార వైభవము తెలియుచున్నది. కర్మబద్ధులు, పాపబుద్ధులునైన చేతనుల కామె చల్లని తల్లి, నారాయణునికి మోహపు పత్ని. ఆమె మాటకు స్వామి యెంత విలువనిచ్చునో రామావతారమున నిరూపితమైనది. బంగరులేడి సృష్టిలో లేదనియు, నది రాక్షస మాయ యనియు స్వామికి తెలియదా? అయినను దానిని తెచ్చి యిమ్మని మోహపు పత్ని కోరినంతనే యడవుల కొండల గుట్టల బట్టి పర్వులెత్తిన లక్ష్మీ కాముకుడా స్వామి. అతడు ప్రియాపురుషకారమును తిరస్కరింపనేర్చునా?

పాపులు పతితులు భ్రష్టులునైన వారిని వెనుక వేసుకొని వచ్చి, వారిని శిక్షింపక దయజూడుమని పతిదేవు నర్థించుటేమి? యను సందియ మక్కరలేదు. ఎవరి యెడలనో దొసగులు చేసి, దోషులైన వారినే కాదు, తనయందే అపచారములు చేసిన దానవకాంతలను మారుతి శిక్షింప నుండగా, నతనిని వారించి శాంతింపజేసిన కృపారస స్వరూపిణియైన శ్రీదేవికి; పరులయం దపచారముల సలిపి పాపులైన వారిని కరుణాదృష్టిని వీక్షింపుమని ప్రాణపతి నర్థించుట లెక్కలోనిది కాదు కదా? ఆమె స్వచ్ఛమైన కరుణారస ప్రవాహము – ఆశ్రితులైన వారి పాపములను క్షాళన జేసి శుద్ధుల జేయు విరజాప్రవాహము కాకుండునా?

మంత్రమున రెండవదగు మతు శబ్దము రథాంగపాణియైన శ్రియఃపతికిని ఆమెకును గల యేమాత్రమే నెడబాటు లేని నిత్యయోగమును తెలుపును. ఆమె నిరంతరము పతిదేవుని యున్నత వక్షమును వీడకుండును. అందు నిత్య నివాసముచేయు రసికురాలామె. ఆమె యట్లు నిత్య నివాసము చేయు కారణమేమి కావచ్చును? స్వామియా – నిరంకుశుడు. జీవులా – ఎంతలేసి దోషములో చేసియున్నవారు. వారికి స్వామియే తమ రక్షకుడను యెఱుక కలిగి యెపుడు స్వామిని నాశ్రయింప వత్తురో? అంతదనుక వారితో విసిగి వేసారియున్న స్వామి తాను సమక్షమున లేనిచో నెట్లు వ్యవహరించునో? జీవు లేకష్టముల పాలగుదురో? అని శ్రీదేవి సర్వకాలమందును పతిదేవుని వక్షఃపీఠమందు నిత్య నివాసము చేయుచు కనిపెట్టి యున్నది.

కాకము తన యందు చేసినది మహాపచారము, లోకలోకములకు పర్వు లెత్తినను, సర్వదేవతలను, చివరకు ముల్లోకముల నేలు తన తండ్రిని వేడినను, శరణమిచ్చువారు కరవైరి. ఏకైక శరణ్యుడగు స్వామి పాదములే శరణ్యములైనవి.

లోకమాత యగు శ్రీదేవి, ఘోరాపరాధియగు కాకమును సైతము కరుణించుమని స్వామిని కోరి పురుషకారము చేయగా, స్వామి కాకమును కరుణించెను. అంత దయాహృదయ శ్రీదేవి.

మహాపాపియగు దశకంఠు డెప్పుడు రామబాణపు పాలబడునో యని, అపహరణ నెపమున కమలాలయ లంకకు పర్వెత్తినది. రాముని శరణు పొందుమని రావణునికి హితవు చెప్పినది. కాని కాకముపాటి స్వారస్యమైన నెరుగని లంకాధిపతి, రామబాణాగ్ని కాహుతి యయ్యెను కదా! రావణానుజుడగు విభీషణుడు, తాను స్వయముగ లోకమాత నర్థింపకున్నను, సరమా కుమారి ద్వారా శ్రీదేవ్యనుగ్రహ పాత్రుడయ్యెను.

ఇట్లా పరంధాముని యనుగ్రహము శ్రీదేవి పురుషకారమున పొందిన వారనేకురు. మునులకైన నలవికాని స్వామి యనుగ్రహ భాగ్యమును వాలి సోదరుడగు సుగ్రీవుడెట్లు పొందగలిగెను? శ్రీదేవి ధరించిన దివ్యాభరణముల ముల్లె స్వామి ముందుంచియే కదా! ఇట్లు మాత శబ్ద విచారమెంతేని జేయదగి యున్నది. ఇక నారాయణ శబ్ద విచారము చేయుదము.

లోన కారుణ్య భావము లేనివాడు, ఎవరు చెప్పినను కారుణ్యము చూపజాలడు. స్వామి కల్యాణ గుణములలో దయ యొకటి. శ్రీదేవి దాని నుద్దీపన మొనర్చుచుండును. జీవులెన్నియో అపరాధములు చేయువారు, స్వామి వారిని శిక్షించునేమో? యని వ్యథజెంది కమలాలయ కనిపెట్టి యుండును. ఆమె "స్వామీ ఎన్నడును దోషములే చేయని వారుందురా? దోషపదము ఏర్పడిన దనిన – దోషములు చేయువారున్నారనియే కదా! వీరో, బద్ధచేతనులు. ప్రకృతి సంబంధ దోషమేదియో చేసియే యుందురు; అది యంతమాత్రమే. అయిన వీరు నాకును, నా మూలమున నీకును ఆశ్రితులు. వీరియం దనుకంప కలిగి

యుండుము" అని స్వామికి విన్నవించుట ద్వారా – స్వామి యందలి కారుణ్య గుణము వెల్లడియగునట్లు చేయును.

స్వామి యజ్ఞాన దోషమును లెక్కింపక తాను గొల్లకులమున జన్మించిన వాడు. గోప బాలబాలికలతో సావాసము చేసినవాడు. ఆశ్రయించిన వారికి జ్ఞానదాతయైన వాడు. తాను పరంధాముడైనను మనుజ జన్మనెత్తి మానవునిగా సంచరించిన వాడు. వారి కామవాసనలు పోగొట్టి మధురభక్తి పూరితుల నొనర్చిన వాడు. స్వామి యొక్క యింతటి ఔదార్యము వాత్సల్యము నారాయణ శబ్దము తెలుపుచున్నది. వీనిని వెల్లడి చేయునట్టివి – ఆ స్వామి చరణములు. అవి పద్మపీఠముపై నుండి పద్మమేదో చరణమేదియో తెలియరానట్లున్నవి. ఆ స్వామి హస్తయుగ్మము శంఖ చక్రకాంతులతో (బా)భాసురమైయున్నది. భవ్యకిరీటము తలపైనను సుకుమార సుందర మందహాస రుచి ముఖమునను రాజిలుచున్నవి. ఆ ముఖారవింద మాశ్రితులకు రక్షకమైయున్నది.

ఏతాదృశ లక్షణ లక్షితుడైన నారాయణుని దివ్యచరణములే మనకును, రమాదేవికిని గుణపూర్ణులైన వారందరికి నాశ్రయములు. చంటిబిడ్డ ఏడ్చుచు తల్లి చనుబాలకై వెదకుకొనునట్లు చేతను లెల్లరు నా చరణములకై తపించుచు నన్వేషింపవలసియున్నది. సూర్యకిరణములు సోకినంతనే వికసించిన తామరపూవుల సౌరును నిరసించు దివ్య సౌందర్య మాధుర్యములు ప్రధానముగా గల నారాయణ చరణములు, శేషతయే ప్రధానముగా గల చేతనులందరు పొందదగినవి. చేతనులు వదలినను, అవి వారిని జారిపోనీయవు.

చరణ పదార్థ విదారమైన తదుపరి శరణపదమును గురించి విమర్శింప వలసియున్నది. ఈ పదము మన కుపాయమును సూచించుచున్నది. స్వాధ్యాయము, యజ్ఞము, తపస్సు, సత్కర్మాచరణము వంటి సమస్త

యోగములను దాటి విసిగి వేసారిన వారికి ప్రాపకమైనదేది? మార్గమేది? దాని వెంబడి పయనించి పొందదగినదేది? దేనిని పట్టుకొని చేతనుడు తరింప గలడు? మిగిలిన యన్నిటిని వదలి నారాయణ చరణమునే యుపాయముగా స్వీకరించి యభ్యుపగమ్యుడగు స్వామిని చేరుమని శరణ శబ్దముపదేశించు చున్నది. అనిష్టము లన్నియు స్పష్టమైననేకదా యిష్టసిద్ధి కలుగునది? కనుకనే అనిష్టములైన రాగద్వేషములు, జన్మజరాదులు, పుణ్యపాపములు వంటి వానిని వేదాంతులు ద్వంద్వములనుచున్నారు. వీని నధిగమించవలెను. జీవులకు కర్మానుగుణముగా నాయా యోనులందు జన్మలు కలుగచున్నవి! వేర్వేరు లోకముల నివాసము ప్రాప్తించుచున్నది; ఆధివ్యాధులు, ఆధిభౌతికాది తాపములు వేధించుచున్నవి. దీనులై పరిదేవనము చెందుచున్నారు. వీని నధిగమించినను దేహమే ఆత్మయను భ్రాంతి మిగిలియుండును. దానిని కూడ వదలిన చేతనుడు శరణాగతి ద్వారా గుహ నుండి వెలివడినట్లు లోకబంధముల నుండి విముక్తి నంది అర్చిరాది మార్గగామి యగుచున్నాడు.

ఆ మార్గమున పయనించుచు భువనోపరి లోక ఆవృతులను దాటుచు జీవుడు విరజానదిని జేరును. పురాకృత కర్మఫలముచే నింకను శేషించియున్న కల్మషములనన్నిటిని విరజానదిలోని చల్లని నీటితోను, ఆ నీటి కెరటములపై నుండి వీచు మెల్లని పిల్లగాలుల ద్వారా శమింపజేసుకొని, కరచరణాదులతో కూడిన యాతనామయ దేహమును త్యజించి – ఉపనిప్రదాదులచే పేర్కొనబడిన కాంతిమయ దేహము ధరించును. అట నుండి అప్సరాదులగు దేవయోనులైన వారి సపర్యలందుచు, నిత్యసూరి సావాసమందును. వైకుంఠనాధ దర్శన ప్రాప్తియు, ఆ స్వామి కింకరత్వమును, సేవానియమానుభూతియు పొందును. జీవున కుపాదేయ మిదియే.

ఇంతకు ముందు ప్రాపకములును, యిప్పుడు ప్రాప్యమును చెప్పబడినవి. పరంధాముని పాదమూలమందు చేయు సేవారచనా విశేషమే ప్రాప్యమై యున్నది. మహత్తరమైన ప్రాప్యము కోరదగియున్న వేళ వివేకము గలవాడెవడు కేవలము నశాశ్వతములగు ధనధాన్యాదులను ఆలుబిడ్డలను దేహసౌఖ్యములను కోరును? ఇంతకుముందు చేతనుడుపాయాంతరముల నెట్లు త్యాగమొనర్చెనో అట్లే యుపేయాంతరమైన భోగములును త్యాగము చేయదగినవై యున్నవి. కోరదగిన దొక్కటియే – అది స్వామి పాదములచెంత యవిశ్రాంత కింకరత్వము మాత్రమే.

జీవుడు మొదటి నుండియు విషయప్రవణుడై, ఈశ్వర పరిచర్య చేయక యుండియుండి – తిరిగి తత్పాదసేవలోని రుచిని గుర్తెరిగి యందుకు కటిబద్ధుడై వచ్చి నిలచియుండ, శ్రీహరి ప్రీతితో వాని నామోదింపక యుండునా? పరాత్పరుడు చేతనుల నుండి యాశించున దిదియే కదా! ఇట్లు ద్వయ మంత్ర మందలి యుత్తరవాక్యము కైంకర్య తృష్టతను తెలుపుచున్నది. శ్రీ శ్రియఃపతుల విభూతిని వెల్లడించునదీ ద్వయము. లక్ష్మీనారాయణ యుగ్మము అవిభాజ్యమైనది. వా రాది దంపతులు. మేఘము మెరుపు వంటివారు. మేఘమురిమి భయము కలిగించినను జీవనాధారమగు దయాజలమును వర్షించును. మెఱుపు మేఘమును సర్వసుందరముగా దర్శనీయముగ జేయును. భయమును శాంతింపజేయును. శ్రీదేవి పతివక్షము విడిచియుండదు. రామ వనవాసము నిశ్చయము కాగానే పతికామె ముందు నడచినది. చేతనులు లక్ష్మణుని వలె స్వామిసేవకు సిద్ధము కావలసినవారు. చేతనులైనవారు దేవిని దేవరను వేర్వేరుగా భావింపరాదని ద్వయమంత్ర వైభవము తెలియబలుకు చున్నది. వేరుగా భావించువారి గతిని శూర్పణఖ చరితము తెలుపుచున్నది.

పద్మాలయ కరుణారూపిణియై తన యనుగ్రహపాత్రులైన జీవులకు శ్రీహరిని ప్రాప్యునిగా నొనర్చుచున్నది. కింకర వృత్తినూని తన చరణములను శరణు పొందినవారి కందరకు స్వామి సేవ్యుడగుచున్నాడు. దివ్యాత్ముడగు శ్రీహరి స్వరూపమిది. ఇక 'అయ' పదము యొక్క తాత్పర్య విచారము చేయుదము. ఈ పదము చేతనుడు స్వామికి చేయదలచు సర్వవిధ సేవావృత్తి విశేషముల నుపపాదించుచున్నది. సేవించిన వారికి శ్రియఃపతి యొక్క దివ్య ముఖార విందముపై వెలయు నాదరపూర్వకమైన చిరునగవు యొక్క యనుభూతి ప్రాప్తించును. స్వామి యనురాగదృష్టి చేతనుని దుఃఖవాసన లింకేవేని మిగిలి యున్న, వానిని తక్షణమే పోగొట్టును. నిత్య నిర్మలానంద సౌఖ్యమును ప్రసాదించును.

జీవుడెప్పుడును పరతంత్రుడే. దాని లక్షణము కింకరత్వము. శరణుజొచ్చి నమస్కరించి ప్రార్థించుటచే నది శోభించును. కానిచో ఫలింపదు. దానిని నిష్టానియమములతోను శ్రద్ధావధానములతోను నిర్వర్తించుట వృత్తిధర్మ మగును. మరి జీవుని స్వరూపమేమి? తాను నిర్వర్తించు దాస్యముచే గదాధరునామోదింప జేయుటే జీవధర్మము. కాన యొకింతయైన సేవ చేయనిదే కింకరత్వమును గాని, స్వామి యనుగ్రహపూర్వక ముఖదర్శనముగాని లభ్యము కావు.

నమః పద సమన్వయమేమి? అహంకార మమకారములు రెండును అనిష్టములు. అవి అవిద్యా రుచి వాసనలు కలిగియుండి ఈశ్వరానుగ్రహమునకు ప్రధాన ప్రతిబంధకములుగా నుండును. వీనిని వాసనా సహితముగ పరిహారము జేసి ప్రకృతి విమోచన పొందించునది ప్రార్థన యగును. భాష్యకారుల శరణాగతి గద్య ప్రాచీన ప్రబంధముల విమర్శనాపూర్వక పరిశీలనా ఫలితముగా రూపు దిద్దుకొనినది. అది భగవన్ముఖ పద్మవికాసమే చేతనుల కేకైక భోగ్యమనియును,

ఈశ్వర ప్రపత్తి యందేమరుపాటేమాత్రము తగదనియు మరియు నట్టి యేమరపాటు పురుషార్థప్రదము కాదనియు తెలుపుచున్నది.

ఈ పాడు శరీర మెప్పుడు నొకే విధముగా నుండదు. ఎప్పు డే కీలు కదులనని భీష్మించునో! కనుక కీళ్లు నాలుగు నాడుచుండగానే మన యాచార్య వర్గము మంగళాశాసనము చేసిన దివ్యదేశములు తిరిగి రావలెను. స్వామి ప్రసాదించిన కన్నులను కాళ్లను సార్థకము చేసుకొనవలెను. నోరున్నందుకు భగవద్గుణ వైభవములను కీర్తించవలెను. ఆచార్య కరుణచే లభించిన ద్వయాను సంధానము చేయుచు భవసాగరము దాటవలెను. భగవత్కైంకర్యము ఆచరించ వలసినదే కాని గ్రంథపఠనచే లభ్యముకాదు. శ్రీదేవి యొక్క పురుషకారముతో స్వామి పాదములను శరణుపొంది, సేవా భాగ్యముతో భగవదనుగ్రహము పొందవలెనని ద్వయ ముపదేశించుచున్నది.

## ద్వయమంత్రం

**శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే**

**శ్రీమతే నారాయణాయ నమః**

